
పాతశానంబట్ల వద్ద..

ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్టకు ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేస్తున్నాం. రోజుకు ముగ్గురు వీఆర్వోల చొప్పున.. నిఘా పెట్టి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటాం.

- గత నెల 6వ తేదీన చంద్రగిరి తహసీల్దారు శివరామసుబ్బయ్య చెప్పిన మాటలివి. క్షేత్రస్థాయికి వచ్చేసరికి ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా సాగుతూనే ఉంది.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి


ఎం.రంగంపేట వద్ద భీమానదిలో

టాస్క్‌ఫోర్సు ఏమైనట్లు?

యథేచ్ఛగా ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా

ఫిర్యాదులపైనా పట్టించుకోని అధికార యంత్రాంగం

చంద్రగిరి మండలంలోని స్వర్ణముఖినది, భీమానది, దోసుళ్ల వంకలలో యంత్రాలతో ఇసుక తవ్వేస్తున్నారు. టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఉచిత ఇసుక విధానంలో.. తమ అవసరాలకు ఎవరైనా ఎక్కడైనా ఇసుక తీసుకోవచ్చు. కాకుంటే మనుషుల ద్వారా తవ్వి పోసుకోవాలన్నది నిబంధన. ఇక్కడా నిబంధనల అమలు కావడంలేదు. ఎటుచూసినా ఎక్స్‌కవేటర్లతో తవ్వడాలే. ప్రధానంగా స్వర్ణముఖి నదిలో నరసింగాపురం వద్ద, రెడ్డివారిపల్లె, చంద్రగిరి-శ్రీనివాసమంగాపురం బ్రిడ్జి వద్ద, చంద్రగిరి బ్రహ్మంగారిగుడి, కేశవరెడ్డి స్కూల్ వద్ద, పాతశానంబట్ల, దోర్నంకబాల వద్ద దోసుళ్ల వంక, తొండవాడ ఎస్టీ ఆర్ కాలనీ వద్ద, భీమా నదిలో ఎ.రంగంపేట, భీమవరం, నారావారిపల్లె తదితర ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. దీనిపై సమాచారం ఇస్తే చేస్తే 'వెంటనే దాడులు చేస్తాం' అనే సమాధానం తప్ప రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని స్థానికులు చెబుతున్నారు. ఒక వేళ దాడులు చేస్తే చంద్రగిరిలో పలుకుబడిన ఉన్న నాయకుల ట్రాక్టర్లు, టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లను వదిలేసి, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాలను సీజ్ చేసి చేతులు దులుపుకొంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఎ.రంగంపేట పంచాయతీ దర్శిపల్లి వద్ద గ్రామానికి ఆనుకొనే ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని, సర్పంచ్ ఎర్రయ్య రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎ.రంగంపేట వద్ద భీమా నది నుంచి భాకరాపేట, పులిచెర్ల, కొత్తపేటకు ఇసుక టిప్పర్ల ద్వారా తరలిపోతుంది. చంద్రగిరి, పాతశానంబట్లకు చెందిన ఇసుక అక్రమ దారులు టిప్పర్ల ద్వారా భారీగా మామిడి తోటల్లో డంపులు ఏర్పాటు చేసి, తిరుపతికి తరలిస్తున్నారు. ఇక, గంగుడపల్లె, చిన్నరామాపురం వద్ద చెరువులో నుంచి యధేచ్ఛగా గ్రావెల్ అక్రమ రవాణా జరుగుతుంది. దీనికి డూప్లికేట్ బిల్లులు చూపిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కాగా, గత ప్రభుత్వంలోనూ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన వారే.. ఇప్పుడూ ఇసుక తవ్వేస్తున్నారన్న విమర్శలున్నాయి.


చంద్రగిరి ఇందిరమ్మ కాలనీ వద్ద ఇసుక డంపు


చంద్రగిరి బ్రహ్మంగారి గుడి సమీపంలోని స్వర్ణముఖినదిలో..

అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిందెవరు?

ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు ఎవరనేది ప్రజల్లో వ్యక్తమవుతున్న సందేహం. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇస్తే.. తమకు సంబంధం లేదంటూ, ఒక్కోసారి తూతూమంత్రంగా చర్యలు చేపడుతున్నారని స్థానికులు అంటున్నారు. ఇక, మండలంలో మైనింగ్‌శాఖ అధికారులు దాడులు చేసిన సంఘటనలు లేదు. పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నా, కొన్ని వాహనాలు మాత్రమే పట్టుకుని సీజ్ చేస్తున్నారు.


గంగుడుపల్లె వద్ద గ్రావెల్ తరలింపు

చంద్రకళ



విధి వక్రీకరించినా ఆమెలో ఆత్మవిశ్వాసం సడలలేదు. భర్త నేర్పిన దారు శిల్పకళను బతుకుదారిగా మలచుకుంది. అద్భుత నైపుణ్యంతో రాణిస్తోంది. 35మందికి ఉపాధి చూపుతోంది పుత్తూరుకు చెందిన చంద్రకళ..

- 8లో

అధ్యక్షా..

పాకాలలో భూసార రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలి



రాయలసీమలోనే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అత్యధికంగా మామిడి దిగుబడి అవుతోంది. ఇక్కడి భూసారానికి.. ఇతర ప్రాంతాల్లోని భూసారం మధ్య చాలా వ్యత్యాసం ఉంది. నూజివీడులో భూసారవంత పరీక్షల సెంటర్ ఉండటం వల్ల అక్కడ మామిడి రైతులు భూసార పరీక్షలు చేసి, అందుకు తగిన ఎరువులు వాడటం వల్ల లాభాలు గడిస్తున్నారు. పాకాల మండలంలో మామిడి పంటకు జోన్‌గా ఉంది. అక్కడ భూసార పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. ఇది రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

- పులివర్తి నాని, చంద్రగిరి ఎమ్మెల్యే

జిల్లాకు 39 మంది ప్రొబేషనరీ ఎస్‌ఐలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాకు కొత్తగా 39 మంది ప్రొబేషనరీ ఎస్‌ఐలను కేటాయిస్తూ డీజీపీ హరీ్‌షకుమార్ గుప్తా ఆదేశాలు జారీ చేశారు. వీరు గురువారం ఎస్పీ కార్యాలయానికి చేరుకుని ఎస్పీ హర్షవర్ధనరాజు ఎదుట రిపోర్టు చేశారు. పోలీసు అతిథి గృహంలో వారితో సమావేశమైన ఎస్పీ ప్రతి ఒక్కరూ చట్ట పరిధిలో ఉద్యోగం చేస్తూ బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. బేసిక్ పోలీసింగ్, టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్పీ హేమంత్, ఏఓ సురేష్‌బాబు, సీఐ సాదిక్ ఆలీ పాల్గొన్నారు.

పుత్రశోకం

- 'పుత్తూరు' ప్రమాదంలో గాయపడిన పెద్ద కొడుకూ మృతి
- శోకసంద్రంలో గట్టు గ్రామం


మునికుమార్(ఫైల్ ఫొటో)


అంబులెన్సులో మృతదేహం రావడంతో గుమికూడిన గ్రామస్థులు, బంధువులు

పుత్తూరు అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పుత్తూరు-చెన్నై జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తమ్ముడు దుర్మరణం చెందగా.. తీవ్రంగా గాయపడిన అన్న కూడా గురువారం అసువులు బాశారు. ప్రమాదంలో ఇద్దరు కొడుకులనూ పోగొట్టుకున్న తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిలింది. పుత్తూరు మండలం నేసనూరు పంచాయతీ గట్టు గ్రామానికి చెందిన రైతు మంజునాథ్ కుమారులు మునికుమార్(19), రవిశేఖర్(18) పుత్తూరులో డిగ్రీ చదువుతున్నారు. బుధవారం ద్విచక్ర వాహనంపై కళాశాలకు బయలుదేరగా.. పిల్లారిపట్టు సమీపంలో రాంగ్‌రూట్లో వస్తున్న ట్రాక్టరు ఢీకొన్న విషయం తెలిసిందే. రవిశేఖర్(18) ప్రమాద స్థలంలోనే మృతి చెందగా, తీవ్రగాయాలై మృత్యువుతో పోరాడిన మునికుమార్(19) గురువారం మధ్యాహ్నం అసువులు బాశారు. పిల్లలపై ఎంతో ప్రేమ పెంచుకుని, వారి ఉన్నతి కోసం కలలు కన్న తల్లిదండ్రులకు తీవ్ర శోకాన్ని మిగిల్చారు. ఇద్దరు కొడుకులను కోల్పోయి ఒంటరిగా మిగిలిపోయారు. తాము సర్వం కోల్పోయామని గుండెలవిసేలా రోదించారు. ఒక్క కొడుకు మృతి చెందిన బాధ నుంచి తేరుకునేటప్పకే మరో కొడుకూ మృతి చెందాడన్న వార్త వారిని కుంగదీసింది. ప్రాణాలతో తిరిగి వస్తాడన్న భరోసాతో ఉన్న తల్లిదండ్రులకు మునికుమార్ విగతజీవిగా రావడంతో కన్నీరుమున్నీరయ్యారు. తమ గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థుల మృతితో గట్టులో విషాదం నెలకొంది. కాగా, బంధువుల సహకారంతో మునికుమార్‌కు ప్రైవేటు ఆసుపత్రిలో మెరుగైన వైద్యం కోసం రూ.12 లక్షలు ఖర్చు చేసినా ఫలితం లేకపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని పలుమార్లు పోలీసు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని, పాత వందన వైన్స్ ప్రాంతంలో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కాగా, మునికుమార్ మృతదేహంతో ధర్నా చేసేందుకు సిద్ధపడ్డారు. పోలీసు అధికారులు వాహన వేగం నియంత్రణకు చర్యలు చేపడతామని విన్నవించడంతో ప్రజలు ధర్నా విరమించారు. కాగా, ప్రభుత్వాస్పత్రి వద్ద మృతుల బంధువులు, గ్రామస్థులు ఆందోళనకు దిగారు. ఆ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.


అంబులెన్సు వద్ద రోదిస్తున్న బంధువులు

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

గూడూరు అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం తిప్పవరపాడు సమీపంలో ఆటో.. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో దంపతులు మృతిచెందారు. వారి పాప గాయపడ్డారు. స్థానికులు తెలిపిన ప్రకారం.. సైదాపురం గ్రామానికి చెందిన మునెయ్య (40), జ్యోతి(35) దంపతులు దుస్తుల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. గురువారం పాప వైష్ణవితో కలిసి వీరిద్దరూ ద్విచక్ర వాహనంలో గూడూరుకు వచ్చారు. తమ పని చూసుకుని గ్రామానికి వెళుతుండగా, ఎదురుగా వస్తున్న ఆటో అదుపుతప్పి వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో మునెయ్య అక్కడికక్కడే మృతిచెందగా, గాయపడిన జ్యోతిని చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వీరి పాప వైష్ణవికి గాయాలయ్యాయి. రోడ్డు ప్రమాదంలో భార్యభర్తల మృతితో పాప అనాథగా మారింది. సంఘటనాస్థలాన్ని రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన మునెయ్య, జ్యోతి (ఫైల్ ఫొటో)

మిస్సయిన భక్తుడి కోసం..!

- అవ్వాచారి కోన లోయలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు

తిరుమల, మార్చి6(ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలినడకమార్గంలోని అవ్వాచారి కోన లోయలోకి దూకిన వ్యక్తి కోసం భద్రతా సిబ్బంది గురువారం తనిఖీలను కొనసాగించారు. అక్కగార్ల ఆలయానికి సమీపంలో బుధవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి లోయలోకి దూకినట్టు శ్రీహరిబాబు అనే భక్తుడు భద్రతా సిబ్బందికి సమాచారం ఇచ్చారు. పోలీసులు, విజిలెన్స్ ఫారెస్ట్, ఫైర్ అధికారులు, సిబ్బంది దాదాపు 300 మీటర్లు లోయలోకి దిగి గాలించినప్పటికీ ఎలాంటి ఆనవాళ్లు లేకపోవడంతో తిరిగి వచ్చేసిన విషయం తెలిసిందే. తిరుమల నుంచి బయలుదేరి తిరుపతి చేరుకోని వారి గురించి సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు ఓ వ్యక్తిని గుర్తించాడు. భక్తుడు చెప్పిన ఆనవాళ్లు కూడా సరిపోవడంతో ఈ వ్యక్తి ఎక్కడి నుంచి వచ్చాడు, తిరుమలలో ఏం చేశాడనే అంశాలను తెలుసుకునేందుకు రివర్స్ మోడ్‌లో సీసీ కెమెరాల ఫుటేజీను పరిశీలించగా ఆ వ్యక్తి తిరుమలలో టీ మాస్టార్‌గా పనిచేస్తున్న వీరప్ప అనే వ్యక్తిని కలిసినట్టు గుర్తించారు. ఈమేరకు వీరప్పను ప్రశ్నించగా అతని పేరు సిద్దారెడ్డిగా తెలిసింది. సిద్దారెడ్డికి చెందిన ఓ కీ ప్యాడ్ ఫోన్, ఓ జత బట్టలను వీరప్ప పోలీసులకు అందజేశాడు. దీంతో పోలీసులు ఆ దుస్తుల ఆధారంగా డ్యాగ్ స్క్వాడ్‌తో గురువారం అవ్వాచారి కోనలోయలో గాలించారు. ఈక్రమంలో పోలీసు డాగ్ కేవలం 30 మీటర్లు మాత్రమే లోపలకు వెళ్లి తిరిగి వెనక్కి వచ్చేసింది. దీంతో రెండో రోజూ ఆ వ్యక్తి గురించి ఎలాంటి ఆధారాలు లభించలేదు.



సిద్దారెడ్డి (ఫైల్.. సీసీ ఫుటేజీ ఫొటో)

ముక్కంటి ఆలయంలో శాంతి అభిషేకం

శ్రీకాళహస్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం శాంతి అభిషేకం నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాలు ముగిసిన మరుసటి రోజు ఉత్సవర్లకు శాంతి అభిషేకం నిర్వహించడం సంప్రదాయం. ఆలయంలోని అలంకార మండపం వద్ద ఉత్సవర్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అభిషేకాలు చేవారు. ఉత్సవాల్లో తెలియక పొరపాట్లు జరిగుంటే ప్రాయశ్చిత్తం కలిగేలా ఉత్సవమూర్తులకు హోమం ద్వారా శాంతి పూజలు చేస్తారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, అధికారులు, టీడీపీ నాయకులు చెంచయ్య నాయుడు, విజయకుమార్ పాల్గొన్నారు.



'సీసీ' నిఘాలో తిరుపతి!

- తొలిదశలో ముఖ్య ప్రాంతాల్లో ఏర్పాటు
- మలి విడతలో నగరమంతటా

తిరుపతి(నేరవిభాగం), మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక క్షేత్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ చర్యలు చేపడుతోంది. దశలవారీగా తిరుపతి నగరాన్ని సీసీ కెమెరాల నిఘాలోకి తీసుకెళ్లేలా ప్రణాళిక సిద్ధం చేసింది. తొలుత ముఖ్యప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండు చుట్టుపక్కల, పెద్దకాపులేఅవుట్ ప్రాంతాల్లో దాదాపు 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్‌లో జీపులు, ఆటోల కట్టడికి, అసాంఘిక శక్తులపై నిఘాకు మరో 10 సీసీ కెమెరాలు అమర్చారు. కర్నాల వీధి నుంచి పూర్ణకుంభం సర్కిల్ వరకు ప్రతి 100 మీటర్లకు ఒక శక్తిమంతమైన కెమెరా, ఎప్పుడూ తిరుగుతూ ఉండేలా ఏర్పాటు చేశారు. మరోవైపు దేశ విదేశాల నుంచి తిరుమలకు కాలినడకన, వాహనాల్లో భక్తులు వెళుతుంటారు. టీటీడీ ఉద్యోగులు, స్థానికులు కొందరు ద్విచక్ర వాహనాలు, కార్లు, జీపులను అలిపిరి వద్ద పార్కింగ్ చేసి కొండకు వెళుతుంటారు. ఇటీవల అలిపిరి సమీపంలోని భూదేవి కాంప్లెక్సు, లింక్ బస్టాండును అడ్డాగా చేసుకుని విచ్చలవిడిగా చోరీలు, పిక్ ప్యాకెట్లు, భక్తులను వివిధ రకాలుగా మోసగించి డబ్బులు లాక్కోవడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. వీటిని దృష్టిలో వుంచుకుని ఎస్పీ హర్షవర్ధన రాజు.. తాజాగా భూదేవి కాంప్లెక్సు వద్ద మరో 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. తిరుపతిలో ట్రాఫిక్ నియంత్రణ, గంజాయి అక్రమ రవాణా, రౌడీలు, ఆకతాయిల ఆటకట్టించడం, విద్యార్థినులకు రక్షణ, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం వంటి కార్యకలాపాలను అడ్డుకోవడానికి రెండో దశలో అంతటా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. అన్ని రోడ్లు, రద్దీ కూడళ్లు, ఫ్లైఓవర్‌పై శక్తిమంతమైన కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. స్మార్ట్ సిటీ నిధుల కింద వీటిని కొనుగోలు చేయనున్నారు. ఇలా ఆయా శాఖల సమన్వయంతో నగరమంతటా సీసీ కెమెరాలను అమర్చనున్నారు. దీంతో ఆధ్యాత్మిక క్షేత్రం పూర్తిగా సీసీ నిఘాలోకి రానుంది.


కమాండ్ కంట్రోల్ నుంచి సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం) : 6.25
సహరి (శనివారం) : 5.06

తిరుపతి ఎయిర్‌పోర్టులో శ్రీవాణి టికెట్ల కోటా పెంచండి

తిరుపతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో విక్రయించే శ్రీవాణి టికెట్ల కోటా పెంచాలని విమానాశ్రయం అధికారులు టీటీడీని కోరారు. ప్రస్తుతం ఇక్కడ రోజుకు 200 టికెట్లు మాత్రమే జారీ చేస్తున్నారు. మధ్యాహ్నం తర్వాత విమానాల్లో వచ్చేవారికి టికెట్లు లభించడం లేదు. ఈ సంఖ్యను వెయ్యికి పెంచాల్సిందిగా విమానాశ్రయ అధికారులు కోరినట్లు తెలిసింది. అలాగే రూ. 300ల దర్శన టికెట్ల కౌంటర్‌ను కూడా ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేయాలని, రోజుకు 1000-1500 టికెట్లు కేటాయించాలని కోరారు. ఇందువల్ల దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విమాన ప్రయాణీకుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని అధికారులు, పాలక వర్గం ముఖ్యులు చెప్పినట్లు సమాచారం.

20 అడుగుల ఏకశిలా విగ్రహం

అలాగే తిరుపతి విమానాశ్రయం లాంజిలో 20 అడుగుల శ్రీవారి ఏకశిలా విగ్రహం ఏర్పాటు చేయాలని కూడా ఎయిర్‌పోర్టు అధికారులు నిర్ణయించారు. ఎయిర్‌పోర్టు వెలుపల కూడా రెండు చిన్న విగ్రహాలు ఏర్పాటు చేయాలనుకుంటున్నారు. శ్రీవారి శిలా విగ్రహాలను భక్తుల సహకారంతో అందించాలంటూ ఎయిర్‌పోర్టు అధికారులు టీటీడీని అభ్యర్థించారు. దీనికి టీటీడీ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించినట్టు సమాచారం.

తిరుచ్చిపై కృష్ణభగవానుడి అభయం



తిరుచానూరు, మార్చి 6(ఆంధ్ర జ్యోతి): పద్మావతి ఆలయ ప్రాంగణంలో రుక్మిణి, సత్యభామ సమేత కృష్ణునికి గురువారం సాయంత్రం అత్యంత వేడుకగా తిరువీధి ఉత్సవం జరిగింది. స్వామివారి జన్మనక్షత్రం రోహిణి సందర్భంగా అర్చకులు ఉత్సవర్లకు వేడుకగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఉభయదేవేరిలతో కృష్ణుడు బంగారు తిరుచ్చిపై కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయప్రదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుభాస్కర్‌నాయుడు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

రైతుసంఘాల ఐక్యతతో దళారులకు అడ్డుకట్ట



సదస్సులో మాట్లాడుతున్న దశరథరామిరెడ్డి

పాకాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రైతులు సంఘాలను ఏర్పాటు చేసుకొని మామిడి గుజ్జు పరిశ్రమలకు నేరుగా సరఫరా చేయడం ద్వారా దళారి వ్యవస్థకు అడ్డుకట్ట వేయవచ్చని జిల్లా ఉద్యాన అధికారి బి.దశరథరామిరెడ్డి ,చెప్పారు. దామలచెరువు పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం మామిడిలో సస్యరక్షణ, మార్కెటింగ్‌పై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మామిడిలో ఫ్రూట్ కవర్స్ ప్రాముఖ్యతను వివరించారు. టుబుల్ రకాలు పెద్ద నిమ్మకాయ పరిమాణంలో ఉన్నప్పుడు కవర్స్ కడితే కాయల నాణ్యత పెరిగి రెట్టింపు ధరకు పంటను విక్రయించవచ్చన్నారు. ప్రభుత్వం హెక్టారుకు 10వేల కవర్లకు రూ. 10వేల రాయితీ ఇస్తుందన్నారు. రైతు సేవాకేంద్రాలలో సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాస్ కేకెకే సీనియర్ శాస్త్రవేత్త టిఎస్ సుధాకర్ నీటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి ఎస్‌శైలజ, మండల వ్యవసాయ అధికారి పుష్పలత రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సిద్ధేశ్వరుడి మారు పొంగళ్ల వేడుక



ఎర్రావారిపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి); జంగమల శంఖునాదం ...యాదవుల ఆవాహన కీర్తనల ఆరాదనతో తలకోన గిరులు పులకరించాయి. సిద్ధేశ్వరాలయంలో మారుపొంగళ్ల పూజోత్సవంతో మహాశివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. గురువారం ఉదయం సిద్ధులు తయారు చేసిన సిద్ధప్రసాదాన్ని సిద్ధమండపంలో నందివాహనంపై వేంచేసిన సిద్ధేశ్వరస్వామి,సిద్ధేశ్వరదేవిలకు నైవేద్యంగా సమర్పించారు. జంగమలు, యాదవులు స్వామి వారిని ఆవాహన చేశారు. సిద్ధపూజోత్సవానికి భారీగా భక్తులు తరలివచ్చారు. ఆలయ పాలనాధికారి రవీంద్రరాజు, ట్రస్ట్ చైర్మన్ సోమనాథరెడ్డిలు తొలి,మలి హారతులిచ్చారు. భక్తులకు ప్రసాదం వితరణతో సిద్ధపూజ ముగిసింది.

అనుపల్లిలో ఆక్రమణల తొలగింపు



రామచంద్రాపురం, మార్చి 6(ఆంధ్ర జ్యోతి): అనుపల్లి పంచాయతీ చెరువు కాడ రోడ్డు ఆక్రమణను రెవెన్యూ అధికారులు గురువారం తొలగించారు. గ్రామానికి చెందిన ఒకరు దారిని ఆక్రమించి కంచె వేశారు. ఈ విషయమై గ్రామస్థులు తహసీల్దారు వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు ఆర్ఐ లక్ష్మీనారాయణ, సర్వేయర్ రమేష్‌బాబు, ఆర్‌సీపురం పోలీసులు చేరుకుని రోడ్డును సర్వేచేశారు. అనంతరం రోడ్డుపై ఆక్రమణలను ఎక్సకవేటర్ సాయంతో తొలగించారు. తహసీల్దారుకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇళ్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి



వెంకటరమణ

రామచంద్రాపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆక్రమిత ప్రభుత్వ భూమిలో నిర్మించిన పక్కాగృహాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు వెంకటరమణ తెలిపారు. మండలంలో ఆక్షేపణ లేని ప్రభుత్వ అనాధీనం భూముల్లో పేదలు నిర్మించుకుని ఉన్న పక్కా గృహాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. 2019 జూలై 1కి ముందుగా నిర్మించుకున్న పేద ప్రజలకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తుందన్నారు. మిగిలినవారు ప్రభుత్వ మార్కెట్ విలువ ప్రకారం నగదుచెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. క్రమబద్ధీకరణకు ముందు దరఖాస్తుదారులు ఇంటి పట్టా పొంది ఉండకూడదన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



పులివర్తి సుధారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

రామచంద్రాపురం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సొరకాలయపాళెం జడ్పీఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు, సరస్వతి పూజ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నాని సతీమని సుధారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. పాఠశాలకు 62 బెంచీలను వితరణ చేసిన ప్రొఫెషనల్ కొరియర్ అధినేత రామినేని బాబును ఆమె అభినందించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు జయసుధ,మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, నాయకులు చిన్నబాబు, జనార్దన్ చౌదరి, గిరిబాబు, మాధవి, ఉమాపతినాయుడు, నరసింహారెడ్డి, నాదముని యాదవ్, జేడీ జగన్, మునిరామిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, డిల్లీనాథరెడ్డి, ధనుంజయరెడ్డి, రంజిత్‌కుమార్‌రెడ్డి, వసంతనాయుడు, సాయిరెడ్డి, కిషోర్‌రెడ్డి, జగదీష్, ఎంఈవో మునివేలుపాల్గొన్నారు.

ఆలయ నిర్వహణపై ఇరువర్గాల వివాదం



సర్దిచెబుతున్న సీఐ సుబ్బరామిరెడ్డి

చంద్రగిరి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురం కూడలిలోని కనకదుర్గమ్మ ఆలయం విషయంలో ఇరువర్గాల మధ్య వివాదమేర్పడింది. ఈఆలయంలో ఏటా పూసల సంఘానికి చెందిన వారెక్కువగా వచ్చి పూజలు చేసుకుంటారు. గ్రామస్తులు కూడా అమ్మవారిని పూజిస్తారు. పూసల సంఘమే ఆలయ నిర్వహణ బాధ్యతలను నిర్వహిస్తోంది. కొద్దినెలల క్రితం ఆలయ ఆవరణలోని భారీ చెట్టు నెలకొరిగింది. ప్రహరీ గోడ కూలిపోయింది. గ్రామస్తులు విరాళాలతో ప్రహరీ నిర్మాణానికి పూనుకున్నారు. తమకు తెలియకుండా నిర్మాణం చేపట్టడంపై పూసల సంఘం వారు గ్రామస్తులను ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. కొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి. ఉద్రిక్తత వాతావరణం నెలకొనడంతో సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్‌ఐలు అనిత, రవీంద్రనాయక్, సిబ్బందితో చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. దీంతో తాత్కాలికంగా వివాదానికి తెరపడింది.

క్షయ రహిత గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం



ఫ్లెక్సీలను ప్రదర్శిస్తున్న శ్రీనివాసరెడ్డి,సిబ్బంది

భాకరాపేట, మార్చి 6(ఆంధ్ర జ్యోతి): క్షయ రహిత గ్రామాలే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా క్షయ నివారణాధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డ, జంగావాండ్లపల్లె, ఎగవూరు, దిగవూరు సచివాలయాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర పథకం టీబీ ముక్త్‌కు గ్రామ పంచాయతీ ఎంపిక ప్రక్రియలో భాగంగా సచివాలయాలను పరిశీలిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా టీబీ ముక్త్ పంచాయతీ ఫ్లెక్సీలను ప్రదర్శించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ హరిణిరెడ్డి, ఎంపీహెచ్‌వో అమరనాథరెడ్డి, సూపర్‌వైజర్ సుబ్రహ్మణ్యం, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం ఏర్పాటుకు వినతి

తిరుపతి అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మంగళం పంచాయతీ పరిధిలో స్వయం ఉపాధి కింద శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయించాలని పలువురు మహిళలు ఎమ్మెల్యే పులివర్తినాని సతీమణి సుధారెడ్డిని కోరారు. గురువారం ఆమె సప్తగిరికాలనీలోని కమ్యునిటీహాల్లో ఏర్పాటుచేసిన మహిళలతో ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు స్థానిక సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు.

అర్ధరాత్రి పూజలతో కలకలం

● మందలించిన పోలీసులు



పూజలు చేసేవారిని హెచ్చరిస్తున్న పోలీసులు

చంద్రగిరి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మల్లయ్యపల్లె వద్ద ధనేశ్వరమ్మ ఆలయ సమీపంలోని మామిడి తోటలో బుధవారం అర్ధరాత్రి కొంతమంది పూజలు చేసిన వైనం కలకలం రేపింది. గుప్త నిధుల కోసం కొందరు క్షుద్ర పూజలు చేస్తున్నారని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ అనిత, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వీరి రాకను గమనించి పూజలు చేస్తున్న కొందరు పరారయ్యారు. అక్కడ మిగిలి ఉన్నవారిని పూజలపై పోలీసులు ఆరా తీశారు. తమ కులదైవం నాగాలమ్మను నిలుపుకొంటున్నాని ఓ మహిళ చెప్పింది. క్షుద్ర పూజలు చేస్తే కేసు పెడతామని హెచ్చరించి పోలీసులు వెనుదిరిగారు.

జాబ్‌మేళాలో 38మంది ఎంపిక



నియామక పత్రాలు అందిస్తున్న ఆర్సీరెడ్డి

తిరుపతిరూరల్, మార్చి6(ఆంధ్రజ్యోతి): వేదాంతపురం పంచాయతీ విజయనగర్‌కాలనీలోని డాక్టర్ ఆర్సీరెడ్డి డిగ్రీ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు 38మంది ఎంపికయ్యారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.రవిచంద్రారెడ్డి ఈమేరకు తెలిపారు. వీరికి నియామక పత్రాలను అందజేసి అభినందించారు. ఏపీఎస్ఎస్‌డీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

జీతాల కోసం పారిశుధ్య కార్మికుల నిరసన



తిరుపతిరూరల్, మార్చి6(ఆంధ్రజ్యోతి): జీతాలు ఇవ్వాలని కోరుతూగాంధీపురం పంచాయతీ పారిశుధ్య కార్మికులు గురువారం నిరసనకు దిగారు. ఉదయం విధులను ఆపేసి పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. రెండునెలలు గడుస్తున్నా జనవరి వేతనం ఇప్పటికీ చెల్లించలేదని వాపోయారు. పంచాయతీల్లో నిధులు ఉన్నా కాలయాపన చేయడం తగదన్నారు. కార్మికుల జీతాల బిల్లు విషయంలో కార్యదర్శి రాజకీయ ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నట్లు తెలిసింది.

మెప్మా ఆర్పీ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న సరళ

శ్రీకాళహస్తి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణం 9వ వార్డు పరిధిలో మెప్మా ఆర్పీగా పనిచేస్తున్న సరళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ మేరకు ఆమె చికిత్స నిమిత్తం గురువారం శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో చేరింది. సీపీఐ ఏరియా కార్యదర్శి గురవయ్య, సీఐటీయూ నియోజకవర్గ కార్యదర్శి పెనగడం గురవయ్యలు సరళను పరామర్శించారు. వారు మాట్లాడుతూ గత కొద్ది నెలలుగా మెప్మాలో ఆర్పీగా పనిచేస్తున్న సరళను కొందరు రాజకీయ కక్షసాధింపు ధోరణితో వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. దీంతో సరళ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని ఆరోపించారు.

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య

రేణిగుంట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో వృద్ధురాలు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మండలంలోని వెదలచెరువులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ అరుణ్ కుమార్ కథనం మేరకు.. వెదలచెరువు ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న సరస్వతమ్మ(75) 20 ఏళ్లగా అనారోగ్యంతో, మానసికంగా ఇబ్బంది పడుతూ జీవనం సాగిస్తోంది. ఉదయం కుటుంబ సభ్యులు బయటికి వెళ్లడంతో సమీపంలోని మామిడి తోటలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఆమె మనవడు దినకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిచ్చాటూరు తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

పిచ్చాటూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండల తహసీల్దార్‌గా టి.వి. సుబ్రహ్మణ్యం గురువారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి కలెక్టరేట్ నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. అందరి సహకారంతో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఆగని అక్రమ నిర్మాణాలు

కిందిస్థాయిలో రెవెన్యూ అధికారుల సహకారం?



పాడిపేట శివపురం కాలనీలో ఇంటి నిర్మాణం

తిరుచానూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుచానూరు, పాడిపేట పంచాయతీల్లో పభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయి. కూటమి అధికారంలోకి వచ్చినా ఆక్రమణలు ఆగలేదు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది అవినీతి, నిర్లక్ష్యంతో యథేచ్ఛగా ఆక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. తిరుచానూరు లెక్క దాఖల్లో సర్వే నెం.479లో స్వర్ణముఖి నది ప్రధాన రహదారి వద్ద ప్రభుత్వ భూమిలో ఇల్లు నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికే ఇదే సర్వేనెంబరులో స్వర్ణముఖి నది తీర ప్రాంతం చాలావరకు అన్యాక్రాంతమైంది. నాలుగైదు రోజుల్లో షెడ్లు వేసి తరువాత విద్యుత్‌శాఖ అధికారుల ద్వారా మీటర్లు తీసుకుంటున్నారు.కొంతకాలానికి శాశ్వత నిర్మాణం చేపట్టడం సాధారణంగా మారింది. పాడిపేట పంచాయతీ శివపురం కాలనీలో రెవెన్యూ లెక్క దాఖలు 233/2ఏలో కాలువ పోరంబోకులో రెండు అక్రమ నిర్మాణాలను చేపట్టారు. గత ప్రభుత్వంలో కూడా ఇక్కడ అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికైనా జిల్లా రెవెన్యూ అధికారులు స్పందించకపోతే ఉన్న కాస్త భూమికూడా అన్యాక్రాంతం అయ్యే పరిస్థితి ఉంది



తిరుచానూరు స్వర్ణముఖి తీరంలో అక్రమ కట్టడాలు

ఉత్తమ మహిళా రైతు యువరాణికి సన్మానం



రామచంద్రాపురం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కమ్మకండ్రిగ పంచాయతీ మిట్టూరుకు చెందిన కొడవకంటి యువరాణిని ఉత్తమ మహిళా రైతుగా ఎంపిక చేసి ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు గురువారం సన్మానించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని కృష్ణ ఆడిటోరియంలో యువరాణిని, ఆమె భర్త పురుషోత్తమనాయుడులను సత్కరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వరి, వేరుశనగ, కొబ్బరి పంటలను తక్కువ పెట్టుబడి సాగు చేసిఅధిక దిగుబడిని సాధించినందుకుగాను ఈ సన్మానం జరిగింది. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ఆర్ శారద జయలక్ష్మి దేవి, వ్యవసాయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్, పాల్గొన్నారు.

దాడి ఘటనలో హిజ్రాలపై కేసు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 6(ఆంధ్ర జ్యోతి): ఓ దాడి ఘటనకు సంబంధించి బాధితుడి ఫిర్యాదు మేరకు ఏడుగురు హిజ్రాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. తిరుపతి ఎర్రమిట్టకు చెందిన ఓ వ్యక్తి మహాశివరాత్రి రోజు కపిలతీర్థం ఆలయానికి వెళ్లారు. వచ్చే సమయంలో బయట ఉన్న కొందరు హిజ్రాలు అడ్డుకుని డబ్బులు డిమాండు చేశారు. దీంతో ఆయన రూ.20 ఫోన్ పే చేశారు. దీంతో ఆ ఫోను నెంబరుకు వాళ్లు ఫోనుచేసి రూ.20 వేలు ఇవ్వకుంటే కేసు పెడతామంటూ తరచూ బెదిరిస్తున్నారు. దీంతో ఆయన కొద్ది రోజులుగా ఫోన్ స్విచ్ ఆఫ్ చేశారు. అతడి ఇంటిని గుర్తించిన వీరు ఆటోలో గురువారం అతడి ఇంటికి వెళ్లారు. దౌర్జన్యం చేసి దాడికి పాల్పడ్డారు. బలవంతంగా ఆటోలో తీసుకెళ్తుండగా స్థానికులు కొందరు అడ్డుపడి అడ్డుకున్నారంటూ అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారాయన. దీనిపై ఎస్‌ఐ లోకేష్ బాబు ఏడుగురు హిజ్రాలపై కేసు నమోదు చేశారు. వారిని అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలను నియమించారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

చెరువు ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయండి



ఓటేరు చెరువును పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

తిరుపతి(ఆటోనగర్)/తిరుపతి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండల పరిధిలోని ఓటేరు చెరువును ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఎం నాయకులు కందారపు మురళి, వి.నాగరాజు డిమాండ్ చేశారు. ఓటేరు చెరువును గురువారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ కొన్ని తరాలుగా ఈ చెరువు వందల ఎకరాలకు సాగునీరు అందించిందన్నారు. బ్రిటీష్ కాలం నుంచి చెరువుగా ఉన్న ఈ భూమి రికార్డులను రెవెన్యూ అధికారులు ఎలా మార్పులు చేశారని ప్రశ్నించారు. ఆక్రమణదారులను, భాగస్వాములైన రెవెన్యూ అధికారులను శిక్షించాలని డిమాండ్ చేశారు. చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు జి.బాలసుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర, వేణుగోపాల్, పి.హేమలత, టి.సుబ్రమణ్యం, బుజ్జి, కె.సుమన్ పాల్గొన్నారు.

కాపులను తొక్కేందుకు యత్నం: కిరణ్‌రాయల్



తిరుపతి(వైద్యం), మార్చి 6(ఆంధ్రజ్యోతి): 'తిరుపతిలో కాపులను తొక్కే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగానే కొందరు నా రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక కుట్రపన్నారు' అని కిరణ్‌రాయల్ పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లక్ష్మీరెడ్డితో తనకున్న ఆర్థిక లావాదేవీలను అడ్డం పెట్టుకొని తప్పుడు ప్రచారాలు చేయడం బాధాకరమన్నారు. తాను ఎలాంటి తప్పు చేయలేదనే విషయం తనపై ఆరోపణలు చేసిన మహిళే చెప్పిందన్నారు. తనపై జరిగిన కుట్రలో ఉన్న వారి జాతకాలు తన వద్ద ఉన్నాయన్నారు. వాటన్నింటినీ సాక్ష్యాధారాలు సహా తమ అధినేత పవన్ కల్యాణ్ ముందు ఉంచుతానన్నారు. ఏ తప్పు చేయనంత వరకు తాను పవన్‌కు విధేయుడిగానే కొనసాగుతానన్నారు. ప్రస్తుతం పార్టీ ఆదేశాల మేరకు కార్యక్రమాలకు దూరంగా ఉన్నా, భవిష్యత్తులో పార్టీ కార్యక్రమాల్లోనూ, ప్రజాసేవలోనూ చురుగ్గా పనిచేస్తానన్నారు.

జగన్.. ప్రజాతీర్పును గౌరవించు : బీజేపీ



సమావేశంలో శ్రీనివాసులు,నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు

తిరుపతి(వైద్యం), మార్చి 6(ఆంధ్రజ్యోతి): 'జగన్ ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించు.. ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదా కోసం ఆరాటపడుతుండటం చూస్తుంటే నిజంగా ఆయన మానసిక పరిస్థితి బాగోలేదని అర్థమవుతోంది' అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిపక్ష హోదా కావాలంటే పది శాతం సీట్లు ఉండాలనే కనీస పరిజ్ఞానం కూడా లేకుండా ప్రతిపక్ష హోదా డిమాండ్ చేయడం, ప్రెస్‌మీట్లు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిస్వార్థంగా సేవచేసే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను విమర్శిస్తే క్షమించేది లేదన్నారు. ఇలాగే విమర్శలు చేస్తుంటే దానికి సరైన శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు నవీన్‌కుమార్‌రెడ్డి, వరప్రసాద్, భాస్కర్, డాక్టర్ శ్రీహరిరావు, కరుణాకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

పీఈఎస్ దొరస్వామి కన్నుమూత



చిత్తూరు/యాదమరి/బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పీఈఎస్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి(88)కన్నుమూశారు.వయోభారం సమస్యలతో కొన్నాళ్లుగా ఇబ్బంది పడుతున్న ఆయన బెంగళూరు బనశంకరి రెండోస్టేజ్‌లోని తన నివాసంలో గురువారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య రాధామనోహరి, కుమారుడు జవహర్ దొరస్వామి, కూతురు డాక్టర్ రూప సురేశ్ ఉన్నారు. చిత్తూరు జిల్లాలోని యాదమరి మండలం కోణాపల్లి పంచాయతీ నర్రావూరు గ్రామంలో ఎం. రామానాయుడు, ఎం. మీనాక్షమ్మ దంపతులకు 1937వ సంవత్సరం నవంబరు7న జన్మించిన ఆయన సమీపంలోని కన్నికాపురం ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి వరకూ చదువుకున్నారు. 6 నుంచి ఎస్ఎస్ఎల్‌సీ వరకు చిత్తూరు కణ్ణన్ కాలేజి,బెంగళూరులోని సెయింట్ జోసఫ్ కళాశాలలో డిగ్రీ చదివారు.బెంగళూరు సెంట్రల్ కాలేజీలో ఎంఏ ఎకనామిక్స్ చేసిన ఆయన 1968లో బీఎంఎస్ కాలేజీలో బీఎల్ చదివారు.బెంగళూరులోనే పీఈఎస్ విద్యాసంస్థను స్థాపిం కొంతకాలం ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఆ తర్వాత హనుమంతనగర్‌లో పీయూ కళాశాలను ప్రారంభించారు.



కేంద్ర మంత్రి నుంచి శక్తి పంచాయతీ నేత్రి అభినయ్ పురస్కారం అందుకున్న చెర్లోపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ సుభాషిణిని అభినందిస్తున్న పంచాయతీ ప్రజలు యామిని, మునీంద్ర నాయుడు, తిరుమలేశ్వర్ నాయుడు, చెంచు మోహనకృష్ణ, చెర్లోపల్లి గ్రామ పంచాయతీ మాజీ సెక్రటరీ బాబునాయుడు తదితరులు

ఫీజు పోరును విజయవంతం చేయండి

తిరుపతిరూరల్, మార్చి6(ఆంధ్రజ్యోతి): మాజీసీఎం జగన్ పిలుపు మేరకు ఈనెల12న తిరుపతి, చిత్తూరు కలెక్టర్ కార్యాలయాల వద్ద వైసీపీ ఆధ్వర్యంలో జరుపతలపెట్టిన ఫీజుపోరులో ఉమ్మడి జిల్లానుంచి ఎక్కువసంఖ్యలో విద్యార్థులు పాల్గొనాలని ఆపార్టీ విద్యార్థివిభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి కోరారు. తుమ్మలగుంటలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ విద్యార్థివిభాగ నియోజకవర్గ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. చిత్తూరు కలెక్టరేట్ వద్ద కార్యక్రమానికి కుప్పం, పలమనేరు, పుంగనూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాలు, తిరుపతి కలెక్టరేట్ వద్ద నిరసనకు సత్యవేడు, కాళహస్తి, తిరుపతి, నగిరి, చంద్రగిరి, వెంకటగిరి, సూళూరుపేట నియోజకవర్గాల నుంచి విద్యార్థులు ఎక్కువసంఖ్యలో హాజరయ్యేలా చూడాలని కోరారు.

గాంధీపురంలో నీటివెతలు



వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

తిరుపతి రూరల్, మార్చి6(ఆంధ్రజ్యోతి): గాంధీపురంవీధిలో నీటిసమస్యను పరిష్కరించాలని పలువురు మహిళలు గురువారం సర్పంచ్ ఎం.లక్ష్మి, కార్యదర్శి లతశ్రీని కోరారు. మూడు సంవత్సరాలుగా నీటిసమస్యతో ఇబ్బందిపడుతున్నామని, బోరు ఉన్నా మోటార్ లేదని వివరించారు. ఇక్కడ దాదాపు 50 కుటుంబాల వరకు ఉన్నామన్నారు. అర్థట్యాంకు నీటిని వారం రోజుల పాటు సర్దుకుంటున్నామని వాపోయారు. బోరుబావికి మోటారు అమర్చి సమస్య పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు.

ఇంటర్ పరీక్షలకు 943 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 943 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. గురువారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మ్యాథమెటిక్స్ పేపర్ -1ఎ, బోటనీ పేపర్ -1, సివిక్స్ పేపర్ -1 పరీక్షలు జరిగాయి. 34,171 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 943 మంది గైర్హాజరయ్యారు. 33,228 మంది పరీక్షలు రాశారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ చోటుచేసుకోలేదని ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి వెల్లడించారు.

కొనసాగిన వెటర్నరీ విద్యార్థుల సమ్మె

తిరుపతిరూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారమూ కొనసాగింది. వర్సిటీ ప్రధాన గేటు ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో విద్యార్థులు బైఠాయించి ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. మూగజీవాలకు సేవలందిస్తున్న తమ గోడును పాలకులు ఆలకించి స్టైఫండ్ పెంపునకు తగు చర్యలు చేపట్టాలని కోరారు. నెల రోజులకు పైగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోకపోవడం బాధాకరమని, సమానత్వం, గౌరవం, న్యాయం లభించే వరకు సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు.

టీటీడీ వైద్యులకు సన్మానం



తిరుపతి(వైద్యం), మార్చి 6(ఆంధ్రజ్యోతి): టీటీడీ వైద్య విభాగంలో పదోన్నతి పొంది చీఫ్ మెడికల్ ఆఫీసరుగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎ.బి.నర్మద, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.కుసుకుమారిలను ఉద్యోగ సంఘ నేతలు గురువారం అభినందించారు.

శేష వాహనంపై సుబ్రహ్మణ్యేశ్వరుడి దర్శనం

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణం, తిరుపతి రోడ్డులో వెలిసియున్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ 53వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శేష వాహనంపై ఊరేగారు. గురువారం ఉదయం అమ్మవార్ల సమేత స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పూజలు నిర్వహించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

ఛలో విజయవాడను జయప్రదం చేయండి

తిరుపతి(ఆటోనగర్), మార్చి 6(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10వ తేదీన చేపట్టనున్న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి కోరారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీలు 42 రోజులు సమ్మె చేసిన సమయంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోని నాయకులు శిబిరాల వద్దకెళ్లి అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోపు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దాని గురించి కొన్ని నెలలుగా కోరుతున్నా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. దీనికి నిరసనగా ఈనెల 10వ తేదీన విజయవాడలో చేపట్టనున్న మహాధర్నాకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఇస్తోందని, అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చేనేత శాఖలో అక్రమ బదిలీలకు బ్రేక్

ప్రభుత్వ అనుమతి కోసం వర్క్ ఆర్డర్ నిలుపుదల

తిరుపతి, మార్చి6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర చేనేత, జౌళిశాఖలో అక్రమ బదిలీల వ్యవహారానికి బ్రేక్ పడింది. సంబంధిత శాఖ మంత్రి ఓఎస్డీ ఇచ్చిన పైరవీ లేఖ ఆధారంగా చేనేత, జౌళిశాఖలో జాయింట్ డైరెక్టర్ హోదాతో ఆప్కో జనరల్ మేనేజర్‌గా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఉన్న ఎం.నాగేశ్వరరావును హిందూపురంలోని తెలుగు చేనేత పారిశ్రామిక శిక్షణ కేంద్రం (టీసీపీఎస్‌కే) ప్రిన్సిపాల్‌గా బదిలీ చేస్తూ ఆ శాఖ కమిషనర్ రేఖారాణి సోమవారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వర్క్ ఆర్డర్ జారీ చేశారు. అదేవిధంగా చేనేత, జౌళిశాఖ తిరుపతి రీజనల్ డైరెక్టర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలతో పాటు టీసీపీఎస్‌కే ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న జి.రాజారావును జనరల్ మేనేజర్‌గా నియమించాలని ఇచ్చిన లేఖపై వివాదం చెలరేగింది. ఈ నేపథ్యంలో 'చేనేత శాఖలో అక్రమ బదిలీలు' శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. వర్క్ ఆర్డర్‌ను నిలుపుదల చేస్తూ ప్రభుత్వ అనుమతి కోసం కమిషనర్ రేఖారాణి లేఖ రాశారు. కమిషనర్ స్థాయి అధికారికి జేడీలను బదిలీ చేసే అధికారం ఉండదు కాబట్టి, వర్క్ ఆర్డర్ పేరిట బదిలీ చేయడంపై వచ్చిన కథనంపై ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

జగన్ నోరు అదుపులో పెట్టుకోవాలి : జనసేన



మీడియాతో మాట్లాడుతున్న రాజారెడ్డి

తిరుపతి అర్బన్/(వైద్యం) మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని, విమర్శలు చేసే ముందు ఆలోచించుకోవాలని జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, పార్టీ మహిళా నేత ఆకేపాటి సుభాషిణి అన్నారు. గురువారం వారు వేర్వేరు చోట్ల మీడియాతో మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి, జనసేనాని పవన్‌కల్యాణ్ పై పదేపదే విమర్శలు చేయడం జగన్‌కు అలవాటుగా మారిందన్నారు. తమ నాయకుడు విలాసవంతమైన జీవితాన్ని వదిలి ప్రజల కోసం రాజకీయాల్లోకి వచ్చారని, పదేళ్లలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారని అన్నారు. జగన్‌రెడ్డి పేరు చెబితేనే 11 సీబీఐ కేసులు, కోడికత్తి, గొడ్డలిపోటు గుర్తుకు వస్తాయన్నారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే గెలుస్తానన్న నమ్మకం కూడా ఆయనకు లేదని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష హోదా కావాలని పదేపదే కోరడం చూస్తుంటే ఆయనకు పదవీ కాంక్ష ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. తీరు మార్చుకోకపోతే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో జన సైనికులు బాబ్జీ, కీర్తన, రాజేష్‌ఆచారి, మునస్వామి, వెంకటేష్, రమేష్, పవన్, హేమంత్, జానకిరామిరెడ్డి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

మంగళం ట్రెండ్స్ పాఠశాలలో సరస్వతి విగ్రహ ప్రతిష్ఠ



తిరుపతి అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మంగళంలోని జిల్లా పరిషత్ ట్రెండ్స్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం సరస్వతి విగ్రహం ప్రతిష్ఠించారు. ఉదయం మకరలగ్నంలో మహాకుంభాభిషేకం, వేదమంత్రోచ్చారణల మధ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం అమ్మవారిని వస్త్రధారణ, పూలమాలలతో సర్వాంగసుందరంగా అలంకరించారు.

బీఎన్ఐ తిరుపతి చాప్టర్ ప్రారంభం

తిరుపతి అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్(బీఎన్ఐ)వేదిక ద్వారా స్థానిక వ్యాపారాలు గ్లోబల్ స్థాయికి ఎదిగే అవకాశముందని బీఎన్ఐ డైమండ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ అన్నారు. గురువారం ఓ హోటల్లో తిరుపతి బీఎన్ఐ చాప్టర్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బీఎన్ఐ ద్వారా దేశవ్యాప్తంగా ఎంతోమంది చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభించి గ్లోబల్‌స్థాయిలో అభివృద్ధి చెందారన్నారు. తిరుపతి చాప్టర్ అధ్యక్షుడిగా టెంకాయల దుర్గాప్రసాద్, సీనియర్ డైరెక్టర్‌గా సాయికిరణ్‌రెడ్డిని ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో లాంచ్ డైరెక్టర్ స్వాతి, తిరుపతి చాప్టర్ ఉపాధ్యక్షుడు యువరాజ్‌జైన్, కార్యదర్శి, కోశాధికారి దేవి, 150 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

'పల్లెపండుగ'లో అలసత్వం వహిస్తే చర్యలు

అధికారులకు కలెక్టర్ హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్ర మంలో భాగంగా జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను హెచ్చరించారు. కలెక్టరేట్ నుంచి గురువారం పంచాయతీ, డ్వామా, ఎంపీడీవోలతో ఆయన వర్చువల్ సమావేశం నిర్వహించారు. గ్రామాభివృద్ధి, సీసీ రోడ్ల పనుల్లో పురోగతి చూపాలన్నారు. లక్ష్య సాధనలో చాలా మండలాలు వెనుకబడి ఉన్నాయని, నిర్ణీత సమయంలోపు అభివృద్ధి పనులు పూర్తి కాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న పోస్టల్ క్యారమ్స్ టోర్నీ



క్యారమ్స్ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

తిరుపతి(క్రీడలు), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మల్టీస్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 27వ ఆలిండియా పోస్టల్ క్యారమ్స్ టోర్నమెంట్ శుక్రవారం ముగియనుంది. గురువారం సెమీఫైనల్స్ హోరాహోరీగా సాగాయి. శుక్రవారం జరగనున్న తుదిపోరులో మహిళల సింగిల్స్‌లో ఆర్.వినిత(తమిళనాడు), నీలమ్ గోడకే(మహారాష్ట్ర), పురుషుల డబుల్స్‌లో తమిళనాడు నుంచి రెండు, ఒడిశా-తెలంగాణ జట్లు తలపడనున్నాయి. చివరగా విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు.

మా భూమిని కబ్జా చేశారు

పనులు అడ్డుకున్న బాధితురాలు

తిరుపతి అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): తాతల కాలం నాటి తమ భూమిని కబ్జాచేసి కట్టడాలు చేపడుతున్నారంటూ పావని అనే మహిళ తిరుపతిలో గురువారం ఉదయం పనులను అడ్డుకున్నారు. తమ భూమిలో ప్రహరీగోడ నిర్మాణం, చదును చేయడం దారుణమని ఆగ్రహించారు. కబ్జాకు గురైన రెండెకరాల భూమిని రక్షించి స్వాధీన పరచాలని రెవెన్యూ అధికారులను కోరారు. తమ అత్త నాగభూషణమ్మ స్వయార్జితమైన రెండెకరాల భూమిని మంగళం-శెట్టిపల్లి మార్గంలో తమ పూర్వీకులు 1976లో కొనుగోలు చేశారని మీడియాతో పావని చెప్పారు. ముగ్గురు వ్యక్తులు డెవలప్‌మెంట్ పేరుతో తనను మోసం చేశారని ఆరోపించారు. తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. భర్త చనిపోయారని, తల్లిదండ్రులు కూడా లేరని వాపోయారు.

పోలీసింగ్ పనితీరు ఎలా ఉంది?

- తనిఖీల్లో మహిళలను అడిగిన ఎస్పీ



తిరుపతి (నేరవిభాగం), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): 'ఏమ్మా.. తిరుపతిలో పోలీసింగ్ పనితీరు ఎలా ఉంది? ప్రతిరోజు రాత్రి సమయంలో నైట్ బీట్ పోలీసులు వస్తున్నారా.. లేదా? రాత్రివేళ ఆకతాయిలు ఎవరైనా అల్లరి చేస్తున్నారా?' అని మహిళలను ఎస్పీ హర్షవర్ధనరాజు అడిగారు. తిరుపతిలోని కనక భూషణం లేఔట్‌లోని పద్మావతి పార్కు, గోపాలరాజ్ కాలనీ, సీతమ్మధార రోడ్డు, శాంతినగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో గురువారం రాత్రి ఎస్పీ తనిఖీలు చేపట్టారు. స్థానికులతో మాట్లాడారు. ఆకతాయిల ఆగడాలుంటే వెంటనే తమ దృష్టి తీసుకురావాలని మహిళలకు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో పోలీసులు స్పందించని పక్షంలో ఫోన్ ద్వారా గానీ లేదా స్వయంగా తన కార్యాలయానికి వచ్చి గానీ చెప్పాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై నిఘా ఉంచుతామన్నారు. తిరుపతిలో ఎవరైనా ప్రజలను ఇబ్బంది పెట్టే కార్యక్రమాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, తిరుపతి రైల్వే స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్, ఈస్ట్ పోలీసు స్టేషన్‌ను ఎస్పీ పరిశీలించారు. కర్నాల వీధి నుంచి పూర్ణకుంభం సర్కిల్ వరకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్ నుంచి పరిశీలించారు. అలాగే, భూదేవి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించి ఫుటేజీ నాణ్యంగా, స్పష్టంగా ఉండేలా చూడాలన్నారు. ఆయనతో పాటు ట్రైనీ ఎస్పీ బి.హేమంత్, ఏఎస్పీ కె.రవిమనోహరాచారి, డీఎస్పీ శ్రీలత, సాధిక్‌అలీ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ముగ్గురు స్మగ్లర్ల అరెస్ట్

23 ఎర్రచందనం దుంగల స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తిరుపతి, మంగళం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు-గూడూరు జాతీయ రహదారిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించి ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. 23 ఎర్రచందనం దుంగలను, వ్యానును స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ అధ్వర్యంలో ఆర్ఐ బి.సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ టి.విష్ణువర్ధన్‌కుమార్ బృందం బుధవారం రాత్రి నుంచి కూంబింగ్ చేపట్టింది. నెల్లూరు-గూడూరు జాతీయ రహదారి చవటపాళ్యం వద్దకు చేరుకుని వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ మార్గంలో ఒక వ్యాను వేగంగా రావడాన్ని గమనించారు. ఆపి తనిఖీ చేసే ప్రయత్నం చేయగా, అందులోని ముగ్గురు వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని వెంబడించి పట్టుకున్నారు. వాహనంలోని 23 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్లు చిత్తూరు జిల్లాకు చెందిన వారుగా గుర్తించారు. దుంగలతో సహా వారిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మన సంస్కృతిని భావితరాలకు అందిద్దాం

ఎన్ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి



మాట్లాడుతున్న వీసీ కృష్ణమూర్తి, పక్కనే సుధాకర్‌నాయుడు

తిరుపతి(విద్య), మార్చి6(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రపంచదేశాల్లో ప్రత్యేక గుర్తింపు ఉందని, దాన్ని పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. రైల్వేకాలనీలోని మాతృశ్రీ స్కూల్ 16వ వార్షికోత్సవాన్ని గురువారం మహతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చుకుని ఉన్నత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఏబీవీపీ మాజీ జాతీయ కార్యదర్శి నాగోతు హరికృష్ణ, సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి, డాక్టర్ మహేంద్ర చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దుతున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. వివిధ అంశాల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు స్కూల్ చైర్మన్ డాక్టర్ కె.సుధాకర్‌నాయుడితో కలసి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మినిమం టైంస్కేల్ అమలు చేయాలి

- డీవైఈఓ కార్యాలయం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

తిరుపతి(విద్య), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ అమలు చేయాలని సంఘం గౌరవాధ్యక్షుడు గండికోట నాగవెంకటేష్, కోశాధికారి ఇ.శివకుమార్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం వారు తిరుపతి అర్బన్ ఎంఈఓ కార్యాలయం వద్ద గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలుకు కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని, ప్రభుత్వ వెయిటేజీ, కారుణ్య నియామకాలు, నిర్దిష్టమైన జాబ్‌చార్ట్, ఉద్యోగ విరమణ వయసు పెంపు తదితర సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఈనెల 11వ తేదీన విజయవాడలో చేపట్టనున్న నిరసన దీక్షలో జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. డీటీఈఓ షేక్ హసీనా, సీఆర్ఎంటీ సభ్యులు వేణుగోపాల్, ధనపాల్, నవీన్‌కుమార్, ఆశాలత, రమాదేవి, రూపావతి పాల్గొన్నారు.

ఉన్నత విద్యతో ఉజ్వల భవిష్యత్తు



10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో పూజలు

తిరుపతి(విద్య), మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.బాలాజీ చెప్పారు. స్థానిక బైరాగిపట్టెడలోని మహాత్మాగాంధీ మునిసిపల్ హైస్కూల్ పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం గురువారం నిర్వహించారు. హెచ్ఎం ఎం.మునిశారద ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డీవైఈఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎలాంటి ఆందోళనకూ గురికాకుండా పదవ తరగతి పరీక్షలు చక్కగా రాయాలని సూచించారు. చక్కగా చదువుకుని భవిష్యత్తులో మంచిగా రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎంఈవో బి.భాస్కర్ నాయక్, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉమ్మడి పీజీ సెట్ రద్దు కోసం..

నేడు పీజీ సెట్ ఆఫీసు వద్ద ధర్నా



సంఘీభావం తెలుపుతున్న విద్యార్థి సంఘాల నేతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పీజీ సెట్ రద్దు కోసం నేడు పీజీసెట్ కార్యాలయం ముందు విద్యార్థి సంఘాలు ధర్నాకు పిలుపునిచ్చాయి. ఎస్వీయూలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నేత చలపతి, ఎస్ఎఫ్ఐ నేత అశోక్, పీడీఎస్‌యూ నేత ఆశ, బీసీ విద్యార్థి సంఘ నేత తిరుమలేష్, లా విద్యార్థి సంఘ నేత సుందర్రాజు తదితరులు పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి పీజీ సెట్ రద్దు చేసి, పీజీ అడ్మిషన్ల బాధ్యతను యూనివర్సిటీలకే అప్పగించాలన్నారు. లేకపోతే విద్యార్థులు లేక యూనివర్సిటీలు మూతపడే ప్రమాదం ఉందన్నారు. పీజీ సెట్ రద్దు చేయకపోతే ఉద్యమాన్ని తీవ్రం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లోకేష్, వినోద్, చంద్రనాయక్, శివ, తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్ విడుదల



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో వచ్చేనెల 9వ తేదీ నుంచి నిర్వహించే అంతర్జాతీయ సదస్సు బ్రోచర్‌ను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు గురువారం ఆవిష్కరించారు. సంప్రదాయ ఔషధం, ఆధునిక చికిత్స విధానంతో అనుసంధానించాలన్నారు. సంప్రదాయ ఔషధం - ఆరోగ్య రక్షణ అంశంపై బోటనీ విభాగం నిర్వహించే సదస్సు విజయవంతం కావాలన్నారు. కార్యక్రమంలో బోటనీ హెడ్ నాగలక్ష్మీదేవమ్మ, సదస్సు డైరెక్టర్ కామాక్షమ్మ, డాక్టర్ చంద్ర పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ప్రొఫెసర్ పద్మావతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ సైన్స్ కాలేజీ నూతన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మావతి బాధ్యతలు గురువారం స్వీకరించారు. కాలేజీ పరిధిలో బోధన, పరిశోధన ప్రక్రియ సజావుగా సాగేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఫిజిక్స్ హెడ్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు, అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

బాలల రక్షణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్

తిరుపతి (వైద్యం), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బాలలపై లైంగిక వేధింపులను నిర్మూలించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ అన్నారు. రుయా చిన్నపిల్లల విభాగంలో గురువారం బాలల లైంగిక వేధింపులపై అవగాహన, నివారణ నైపుణ్యాలపై పలు శాఖల సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలలపై లైంగిక వేధింపులను గుర్తించడం, నివారించడం, బాధితులకు సహాయం అందించడం గురించి వివరించారు. కార్యక్రమంలో రుయా సూపరింటెండెంట్ రవిప్రభు, వైద్యాధికారులు ప్రదీప్, పద్మావతి, బాలాజీ, సుప్రజాదేవి, జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే చర్యలు

లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడే ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, చేస్తున్నట్లు ప్రకటనలు ఇచ్చినా మూడేళ్ల జైలు శిక్ష, రూ.50 వేలు జరిమానా విధిస్తామని తెలిపారు. భారత వైద్యమండలి నుంచి ధృవీకరణ పత్రాన్ని ఐదేళ్లు తొలగిస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

తిరుచానూరు పంచాయతీ ఉద్యోగిపై విచారణ షురూ

తిరుచానూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పంచాయతీలో కాంట్రాక్టు ఉద్యోగి చేతివాటంపై తిరుచానూరు పంచాయతీలో వసూల్ రాజా శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ప్రచురితమైన వార్తపై స్పందించిన జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి విచారణకు ఆదేశించారు. ఈవోపీఆర్డీ మాధురి విచారణ చేపట్టారు. ఓ డివిజనల్ పంచాయతీ అధికారి పేరు చెప్పుకుని ఆయన సాగిస్తున్న దందాపై వివరాలు సేకరిస్తున్నారు. శుక్రవారం సమగ్ర నివేదిక ఇవ్వనున్నారు.

మహిళాభివృద్ధితోనే నవ సమాజం

తిరుపతి(వైద్యం), మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో రాణించగలిగినప్పుడే నవసమాజ స్థాపన సాధ్యమవుతుందని తుడా కార్యదర్శి డాక్టర్ వెంకటనారాయణ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రెస్‌క్లబ్‌లో ప్రజా కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా దినోత్సవం అంటే వారికి శుభాకాంక్షలు చెప్పడం కాదని, పురుషులతో సమానంగా హక్కులు కల్పించాలని అన్నారు. అప్పుడే ఇల్లు, సమాజం, దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయన్నారు. అనంతరం ఆయన కార్పొరేషన్‌లో పనిచేసే మహిళా కార్మికులను సన్మానించారు.

జగన్..గులకరాయికి ఎక్కువ

డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి గులకరాయికి ఎక్కువ.. కోడికత్తికి తక్కువని, అలాంటి వ్యక్తి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను విమర్శించడం హాస్యాస్పదమని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్ రెడ్డికి పదుల సంఖ్యలో కేసులుంటే పవన్ కల్యాణ్‌కు లక్షలాది మందికి సేవచేసే గుణం ఉందని తెలిపారు. వీరిద్దరికీ నక్కకి నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని పేర్కొన్నారు. మరొకసారి కూటమి నేతలపై అవాకులు, చవాకులు పేలితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

స్విమ్స్ నర్సింగ్ సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలి

తిరుపతి(వైద్యం), మార్చి 6(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో పనిచేసే కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న నర్సింగ్ సూపరింటెండెంట్ ప్రభావతిని వెంటనే విధుల నుంచి తొలగించాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.కార్మికులకు సెలవులుఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నా స్విమ్స్ యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

నగరంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రణాళికలు

తిరుపతి, మార్చి5(ఆంధ్రజ్యోతి) : నగరంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ నిధులతో నగరంలో జరుగుతున్న సిటీ ఆపరేషన్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, డిజైన్ స్టూడియో, గ్లో గార్డెన్, గరుడ వారధి తదితర ప్రాజెక్టుల పురోగతిపై ఆయా ప్రాజెక్టుల ప్రతినిధులు, స్మార్ట్ సిటీ అధికారులతో గురువారం సాయంత్రం ఆమె సమీక్షించారు. మౌర్య మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నగరంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసు, హెల్త్, ప్రణాళికా విభాగం అధికారుల పర్యవేక్షణలో ప్రణాళికలు రూపొందించాలన్నారు. సిటీ ఆపరేషన్ సెంటర్‌లో అన్ని విభాగాలకు గదులు కేటాయించాలన్నారు. గ్లో గార్డెన్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గరుడ వారధి పెండింగ్ పనులను గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఈఈ రవి, డీఈలు రాజు, మహేష్, మధు, డీసీపీ మహాపాత్ర, ఏసీపీ బాలాజీ, ఏఓ రాజశేఖర్, సీఎఫ్ఓ మల్లికార్జున పాల్గొన్నారు.

బీజేపీ మహిళా పక్షపాతి

- రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి

తిరుపతి(విద్య), మార్చి 6(ఆంధ్రజ్యోతి): బీజేపీ మహిళా పక్షపాత పార్టీ అని ఆ పార్టీ సీనియర్ నాయకురాలు, రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఇ.సావిత్రి పేర్కొన్నారు. జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ నేతృత్వంలో గురువారం తిరుపతిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సావిత్రి మాట్లాడుతూ ఎన్ని చట్టాలు, బిల్లులు తెచ్చినా మహిళలపై అఘాయిత్యాలు ఆగడం లేదన్నారు. అన్ని రంగాల్లో లింగ సమానత్వం కోసం మహిళలు పోరాడాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సీనియర్ నేతలు కండ్రిగ ఉమ, నాయకులు నిషిధరాజు, గాలి పుష్పలత, జిల్లా మహిళా అధ్యక్షురాలు వేదవతి పాల్గొన్నారు.



ఆత్మరక్షణ శిక్షణ అవశ్యం : డీఈవో

● రాణీలక్ష్మీబాయి సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ ప్రారంభం

తిరుపతి(విద్య), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బాలికలకు ఆత్మరక్షణ విద్యలో శిక్షణ అత్యంత అవశ్యమని జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ అన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో నిర్వహించనున్న రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన గురువారం డాక్టర్ ఎస్ఆర్కే మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ఆయన ప్రారంభించారు. బాలికలపై పెరుగుతున్న నేరాలను దృష్టిలో ఉంచుకుని వారికి భద్రత కల్పించడానికిగాను ప్రభుత్వం పాఠశాలల్లో బాలికలకు పోరాట విద్యల్లో శిక్షణనందిస్తోందని వివరించారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ మాట్లాడుతూ ఆత్మరక్షణ శిక్షణ ద్వారా బాలికలు మానసికంగా, మేధోపరంగా, శారీరకంగా దృఢంగా రూపొందుతారని, ఆపద సమయంలో తమను తాము రక్షించుకోగలగుతారని చెప్పారు. రూపేష్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రూపేష్‌బాబు, సీఎంఓ సురేష్, పాఠశాల హెచ్‌ఎం ఎంఏ కృష్ణకుమార్, రూపేష్ సొసైటీ శిక్షకులు పాల్గొన్నారు.

→ మాట్లాడుతున్న డీఈఓ కేవీఎన్ కుమార్, పాల్గొన్న డీవైఈఓ బాలాజీ, సీఎంఓ సురేష్ తదితరులు


శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.11 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,285

తలనీలాలు సమర్పించినవారు: 20,829



● దేశ,విదేశాల్లో మెప్పు పొందుతున్న తొర్రూరు కొయ్యబొమ్మలు

చంద్రకళ

జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నాను. గ్రామీణ కళ నాకు కూడుపెట్టింది. నా ఇద్దరు పిల్లల భవిష్యత్తుకి బాట వేసింది. ఈ సమయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సహకారం మరువలేనిది. ఆడవాళ్లతో పాటూ మగవాళ్లకూ ఉపాధి చూపే స్థాయికి నేను చేరుకున్నాను.

- చంద్రకళ



రేపు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఢిల్లీకి వెళ్లినపుడు ప్రధాని మోదీ కీ, కేంద్ర మంత్రులకూ ఏపీ హస్తకళాకృతులను కానుకలుగా అందజేస్తుంటారు. అందులో కొయ్యతో చేసిన దేవతామూర్తులు, గోపురాల బొమ్మలు ముఖ్యమైనవి. ఈ అద్భుత కొయ్య కళాఖండాలు తయారవుతున్నది మన పుత్తూరు మండలంలోని తొర్రూరులో అని చాలా మందికి తెలియదు. ఒక మహిళ ఈ దారుశిల్పాల రూపశిల్పి. ఆమె పేరు చంద్రకళ. భర్త మరణం తర్వాత తను బతకడానికి నేర్చుకున్న కళ ఇప్పుడు 35 మందికి బతుకు చూపిస్తోంది. అంతర్జాతీయ ఖ్యాతికి కారణమైంది.

- పుత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

కుప్పంలో పుట్టిన చంద్రకళ బీకాం కంప్యూటర్స్ చేశారు. అంతకన్నా పై చదువులకు వెళ్లాలనే ఆశ ఉన్నా పేద కుటుంబానికి సాధ్యం కాలేదు. పెళ్లి చేసేశారు. 1998లో పుత్తూరుకి అత్తగారింటికి చేరిన ఆమె తన భర్త సంప్రదాయ పద్ధతుల్లో చెక్కే చేసే కొయ్యబొమ్మలను దీక్షగా చూసేవారు. ఎంత కష్టపడ్డా ఆదాయం వచ్చేది కాదు. ఇద్దరు కొడుకులు పుట్టారు. కొయ్య బొమ్మలు చెక్కడం తనూ నేర్చుకున్నారు. ఆర్థిక సమస్యల్లోంచి బయటపడడానికి ఒక పొదుపు సంఘంలో ఆమె చేరారు. భర్తను ఒప్పించి 5 వేలు అప్పు తీసుకుని వేప, వెంగ, చీమచింత కొయ్యలు కొని తన ఆలోచనలకు అనుగుణంగా బొమ్మలు చెక్కడం మొదలు పెట్టారు. ఈ కొత్తదనం కొనుగోలుదారులను ఆకర్షించింది. 2017లో భర్త హఠాన్మరణం ఆ కుటుంబాన్ని కుంగదీసింది. అయితే చేతిలో ఉన్న కళ ఆమెకు దారి చూపింది. బొమ్మల్లో, రంగుల్లో నిరంతరం కొత్తదనం కోసం చేసిన ప్రయత్నం ఫలించింది. చంద్రకళ చెక్కిన బొమ్మలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. తనలాంటి మరికొందరు మహిళలను ఆమె పోగేసుకుని కొయ్యబొమ్మల పనిలో భాగం చేసింది. ఎంపీఎస్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ పేరుతో ఆమె సంస్థ ఇప్పుడు 35 మందికి ఉపాధి చూపుతోంది. ఆన్‌లైన్‌లోనూ అమ్మకాలు చేస్తోంది. నెలకు లక్షకు పైగా ఆదాయం లభిస్తోంది. మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మార్కాపురంలోని డ్వాక్రా బజారులోనూ తొర్రూరు కొయ్యబొమ్మల ప్రదర్శన ఉంటుంది.

ఇదే ప్రత్యేకత:

సింథటిక్, ఎనామిల్‌తో పాటు మల్టీషేడ్ రంగులను వినియోగించడం వల్ల చంద్రకళ బొమ్మల్లో సహజత్వం ఉట్టిపడుతోంది. బొమ్మల తయారీకి మీమ్ వుడ్ , టీక్ వుడ్, కంట్రీవుడ్ లను ఈమె వినియోగిస్తున్నారు. వీటికి వాటర్‌ప్రూఫ్ కోటింగ్ ఉంటుంది..

తిరుపతి సిగలో మూడు పద్మాలు

ఇల్లాలి చదువు ఇంటికే కాదు జగానికే వెలుగు అని తిరుపతి నగరంలోని మూడు విద్యా సంస్థలు నిరూపిస్తున్నాయి. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీరామారావు ఆనాడే మహిళావిద్య అవసరాన్ని గుర్తించి, వారికోసమే ప్రత్యేకించి ఓ విశ్వవిద్యాలయం తిరుపతిలో ఏర్పాటు చేశారు. అంతకు ఎన్నేళ్ల ముందో టీటీడీ సహకారంతో ఈ నగరంలోనే తొలి మహిళా డిగ్రీ కళాశాల ఏర్పడింది. ఇటీవల ఏర్పడిన మహిళా వైద్యవిద్యాలయం మూడో కిరీటంగా మారింది. మహిళా సాధికారతకు ప్రత్యక్ష సాక్ష్యాలుగా ఈ విద్యాసంస్థలు నిలుస్తున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి..తిరుపతి(విద్య)

తొలి వర్సిటీకి బీజం



పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం

1983 ఏప్రిల్ 14న తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఏర్పడింది. 138 ఎకరాల విస్తీర్ణంలో 9 విభాగాలతో శ్రీకారం చుట్టుకుంది. నాలుగు దశాబ్దాల్లో 50 కోర్సులకు విస్తరించింది. ఆరు వేల మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. . బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో ప్రత్యేకతను చాటుకుంటూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపును పొందగలిగింది. యూజీసీ నాక్ ఏ-ప్లస్ గ్రేడ్‌ను కూడా సాధించింది. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఉత్తమ ర్యాంకు సొంతం చేసుకుంది. విదేశీ విద్యార్థులకు సైతం సంగీత విద్యను నేర్పుతోంది. మహిళల్లో సామాజిక చైతన్యానికి జరుగుతున్న కృషిలో పాలుపంచుకుంటోందీ వర్సిటీ. పీఎం ఉష పథకం కింద అందిన రూ.100 కోట్ల నిధి వర్సిటీ పురోగతికి దోహదపడింది

తొలి 'పట్టా'భిషేకం



పద్మావతి డిగ్రీ కళాశాల

రాష్ట్రంలో తొలి మహిళా కళాశాలకు తిరుపతి కేంద్రమైంది. 1951లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో అబ్బాయిల కాలేజీలో అమ్మాయిలను చేర్చుకోరాదంటూ మద్రాసు వర్సిటీ సిండికేట్ తీర్మానించింది. దీంతో మహిళా విద్యకు గండి పడింది. వెంటనే టీటీడీ స్పందించింది. మహిళలకు బాసటగా నిలిచింది. 1952లో వంద ఎకరాల్లో వేంకటేశ్వర స్త్రీల కళాశాలను ఏర్పాటు చేసింది. రెండేళ్ళకు ఎస్వీ యూనివర్సిటీ ప్రారంభమైంది. 1956లో పద్మావతీ మహిళా డిగ్రీ కాలేజీగా పేరు మారింది ప్రిన్సిపాల్ రాజేశ్వరిమూర్తి నేతృత్వంలో ఈ కాలేజి అభివృద్ధికి విశేష కృషి జరిగింది. మాజీ రాష్ట్రపతులు నీలం సంజీవరెడ్డి, బాబూ రాజేంద్రప్రసాద్, మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి వంటి ప్రముఖులు ఈ కాలేజీని సందర్శించి ముగ్ధులయ్యారు.

● మహిళల ..మెడి'కల' నెరవేరింది

దేశ రాజధాని ఢిల్లీ తర్వాత దక్షిణాదిన తొలి ప్రభుత్వ మహిళా వైద్యకళాశాల తిరుపతిలోనే ఆవిర్భవించింది. 2014లో 50 ఎకరాల్లో స్విమ్స్‌కు అనుబంధంగా పద్మావతి మహిళా వైద్య కళాశాల 150 సీట్లతో ప్రారంభమైంది. తర్వాత బలహీన వర్గాలకోసం 25 సీట్లను కేటాయించింది. యూజీ-నీట్ ద్వారా అడ్మిషన్లు జరుగుతున్నాయి. 175 సీట్లతో ఆరు బ్యాచ్‌ల వైద్య విద్యార్థులను ఇప్పటివరకూ అందించింది. దాదాపు వెయ్యి మంది మహిళా వైద్యులు తయారై సేవలందిస్తున్నారు. ఈకాలేజ్ టీచింగ్ రీసెర్చ్‌గా ఉపయోగపడుతోంది. ఇక్కడి వైద్యులకు ప్రైవేట్ ప్రాక్టీస్ అవకాశం లేకపోవడంలో నాణ్యమైన బోధన జరుగుతోంది. స్విమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ కోర్సుల వల్ల అరుదైన ఆపరేషన్లపై శిక్షణకూ అవకాశం కలుగుతోంది.



పద్మావతి మహిళా వైద్య కళాశాల

ఓటేరు చెరువు వేరు... రైతుల భూములు వేరు

● అసత్య ప్రచారాలు మానండి ● మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు

శ్రీకాళహస్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఓటేరు చెరువుకు, శ్రీకాళహస్తి రైతులకు ఉన్న భూమికీ ఏ సంబంధం లేదని, రెండూ వేరువేరు అని, రైతులు చెరువును ఆక్రమించుకోలేదని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు అన్నారు. గురువారం శ్రీకాళహస్తిలో తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఓటేరు వద్ద రైతులు కొనుగోలు చేసిన భూమిపై ఎలాంటి అసత్య ప్రచారాలు వేయవద్దని కోరారు. తనపై సీపీఎం, సీపీఐ నాయకులు అబాండాలు వేయడం సరికాదంటూ, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అధికారులను బ్లాక్‌మెయిల్ చేసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సర్వే నెంబరు 376లో 12.45 ఎకరాలు ఓటేరు చెరువు అని, సర్వే నెంబరు 370లో 6.70ఎకరాలు కాలువ ఉందని, సర్వే నెంబరు 377లో 17.18ఎకరాలు రైతుల భూమి ఉందని ఆయన వివరించారు. 1906లో బ్రిటీష్‌వారు తయారు చేసిన ఎ రిజిస్టర్, రిజిస్ట్రీ ఆఫ్ హోల్డింగ్‌లో ఇది పుంజు భూమిగా నమోదు అయిందని తెలిపారు. 1906నాటి రికార్డును ఎవరు తారుమారు చేయలేరని స్పష్టం చేశారు. కేసులన్నీ రైతులకు అనుకూలంగా తీర్పులు ఇచ్చాయని చెప్పారు. రైతుల భూముల్లోనే జాతీయ రహదారి నిర్మాణం జరిగిందని చెబుతూ, 'చెరువు భూమి అయితే నేషనల్ హైవే వారు చెరువులో రోడ్డు వేస్తారా?' అని ప్రశ్నించారు. సీపీఎం, సీపీఐ నాయకుల వెనుక ఉండి దుష్ప్రచారం చేయిస్తున్న వారు వాస్తవాలు గ్రహించాలన్నారు.

అది ప్రభుత్వ భూమి కాదు

● శ్రీకాళహస్తి రైతుల వివరణ

తిరుపతి, మార్చి6(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామంలోని సర్వే నెం:377లో 17.18 ఎకరాల భూమి ప్రభుత్వానిది కాదని, సర్వే నెంబరు 376లోని 12.40 ఎకరాలు మాత్రమే ఓటేరు చెరువుకు సంబంధించిన స్థలమని శ్రీకాళహస్తికి చెందిన రైతులు తెలిపారు. ఓటేరు చెరువు అన్యాక్రాంతమవుతోందన్న వివాదం నేపథ్యంలో 'ఓటేరు చెరువు చదరం' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై రైతులు ప్రభుత్వ రికార్డులతో పాటు వివరణ ఇచ్చారు. జాయింట్ పట్టా భూమిని విక్రయ పత్రాల రిజిస్టరు డాక్యుమెంటు ప్రకారం సబ్ డివిజన్ చేసి అడంగల్‌లో నమోదుచేయాలని తాము కోరడంతో, సీఎం రైతుల సమస్యలను పరిష్కరించాలని గత ఏడాది సెప్టెంబరు 24న కలెక్టర్‌కు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అయితే తమ భూమిని కొందరు చెరువుగా భావిస్తున్నారని, సర్వే నెంబరు 376లో 6.7ఎకరాల చెరువు, కసింకాలువను కొందరు ఆక్రమించారంటూ ఒక్క సెంటు భూమి కూడా తాము ఆక్రమించలేదని పేర్కొన్నారు.

రేపటి నుంచి తుడా టవర్స్ వేలం



తుడా టవర్స్‌ను పరిశీలిస్తున్న వీసీ మౌర్య

తిరుపతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అన్నమయ్య సర్కిల్ వద్ద నిర్మిస్తున్న 'తుడా టవర్స్'కు శనివారం నుంచి వేలం నిర్వహించనున్నట్లు వీసీ ఎస్.మౌర్య తెలిపారు. గురువారం నిర్మాణంలో ఉన్న తుడా టవర్స్‌ను ఆమె ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. వేలం నిర్వహణపై తుడా కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు 13 అంతస్థులలో తుడా టవర్స్ నిర్మాణం జరుగుతోందన్నారు. గ్రౌండ్, ఒకటో అంతస్థులో 27 దుకాణాలతో వాణిజ్య సముదాయాలు, రెండు, మూడు, నాలుగు అంతస్థులలో కార్యాలయాలకు, మిగిలిన అంతస్థుల్లో నివాస యోగ్యంగా 2, 3, 4 బెడ్ రూమ్ ఫ్లాట్లు నిర్మిస్తున్నామని వివరించారు. శనివారం నుంచి 12వ తేదీ వరకు వివిధ అంతస్తులకు వేలం నిర్వహిస్తామన్నారు. తుడా టవర్స్‌లో మోడల్ ఫ్లాట్, గ్యాలరీ ఏర్పాటు చేశామని, ఆసక్తిగలవారు చూడొచ్చన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి వెంకటనారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, తదితరులు ఉన్నారు.

● 'కల్తీ నెయ్యి' కేసు నిందితులకు

ముగిసిన సిట్ కస్టడీ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 6(ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసులో ఇద్దరు నిందితులకు మూడు రోజుల సిట్ కస్టడీ ముగిసింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ కేసులో ఏ3 నిందితుడు పొమిల్ జైన్, ఏ5 అపూర్వ వినయ్‌కాంత్ చావడాలను మంగళవారం సిట్ అధికారులు తమ కస్టడీకి తీసుకున్నారు. సిట్ కార్యాలయంలో విశాఖ సీబీఐ డీఐజీ మురళీ రాంబా నేతృత్వంలో అధికారులు వివిధ కోణాల్లో విచారించారు. వారిద్దరి వాంగ్మూలాలను రికార్డు చేశారు. మూడు రోజుల కస్టడీ గడువు ముగియడంతో గురువారం సాయంత్రం బందోబస్తు మధ్య ఆ ఇద్దరిని జ్యుడిషియల్ కస్టడీకి అప్పగించారు. మరోవైపు ఏ2 నుంచి ఏ5 వరకు బెయిల్ కోసం దాఖలైన పిటిషన్లపై ఈ నెల 10న విచారణ జరగనుంది.

టీటీడీ చైర్మన్ పీఆర్వోనంటూ భక్తులను మోసగించిన వ్యక్తి అరెస్ట్

తిరుమల, మార్చి6(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకుని, తాను పీఆర్వోనని భక్తులు నమ్మించి మోసం చేస్తున్న వ్యక్తిని గురువారం తిరుమల టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. చంద్రగిరికి చెందిన ఫరూక్ అలియాస్ ప్రసాద్ ప్రస్తుతం నెల్లూరు జిల్లా కోవూరులో నివాసం ఉంటున్నాడు. నాలుగు నెలల నుంచి 'తిరుమల సమాచారం' అనే వాట్సాప్ గ్రూపులు క్రియేట్ చేసి దాదాపు 600 మంది భక్తులను అందులో చేర్చాడు. తిరుమల శ్రీవారి దర్శనం, సేవలు కావాలంటే తనను సంప్రదించాలని ఆగ్రూపుల్లో పోస్టులు పెట్టేవాడు. తాను టీటీడీ చైర్మన్ పీఆర్వో అని నమ్మించి తిరుమల దర్శన టికెట్ల సమాచారాన్ని గ్రూపుల్లో షేర్ చేసేవాడు. భక్తులు ఎవరైనా వ్యక్తిగతంగా కాల్ చేసి మాట్లాడితే ఆన్‌లైన్ ద్వారా నగదు తీసుకుని ఆ తర్వాత ఆ భక్తులకు ఎలాంటి సమాధానమిచ్చేవాడు కాదు. ఇలా దాదాపు రూ.80 వేల వరకు భక్తుల నుంచి వసూలు చేసి మోసగించాడు. భక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చైర్మన్ బీఆర్ నాయుడు స్పందిస్తూ విచారణకు ఆదేశించారు. ఈక్రమంలో ఫరూక్‌ను అరెస్ట్ చేసి విచారించగా ఆరు సిమ్‌లు, రెండు బ్యాంక్ ఖాతాలతో భక్తులను మోసం చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఫరూక్‌ను అరెస్ట్ చేసి ఓ సెల్‌ఫోన్, సిమ్‌కార్డులు, బ్యాంక్ పుస్తకాలు స్వాధీనం చేసుకుని.. అతడిని రిమాండుకు పంపారు.


గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడి అరెస్టు

● ఐదు కిలోల గంజాయి సీజ్

తిరుపతి(నేరవిభాగం), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడిని తిరుపతి ఈస్ట్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అతని నుంచి ఐదు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ సీఐ రామకృష్ణ వివరాల మేరకు.. తిరుపతి ఎన్టీవీ నగర్‌కు చెందిన కురబ అరవింద కొంతకాలంగా విశాఖ, అరకు, తణుకు ప్రాంతాల నుంచి గంజాయి తెప్పించి విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో ఒడిశా రాష్ట్రం చిత్రకొండకు చెందిన గణేష్ నుంచి రూ.లక్ష విలువైన గంజాయి కొనుగోలు చేసి ఆర్టీసీ బస్సులో తిరుపతికి తీసుకొస్తుండగా ముందుగా అందిన సమాచారం మేరకు తిరుపతి ఈస్ట్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ మహేష్ బాబు బస్టాండులో కాపుకాచి పట్టుకున్నారు. అతని నుంచి ఐదు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అరవిందను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని సీఐ చెప్పారు. ఇదే కేసులో ప్రధాన నిందితుడు గణేష్‌ను అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

రథోత్సవంలో రెచ్చిపోయిన 'కేడీ సిస్టర్స్'

● రద్దీలో చేతివాటం ప్రదర్శన
● ఏడుగురు మహిళల నుంచి ఏడు బంగారు గొలుసుల చోరీ
● ఇద్దరు తమిళనాడు మహిళల అరెస్టు



స్వాధీనం చేసుకున్న బంగారాన్ని చూపుతున్న పోలీసు అధికారులు

శ్రీకాళహస్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరిగిన రథోత్సవంలో తమిళనాడుకు చెందిన ఇద్దరు అక్కా చెల్లెళ్లు చేతివాటం చూపారు. ఏడుగురు మహిళల నుంచి బంగారు గొలుసులు అపహరించారు. వీరిని గురువారం అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం మధురై ప్రాంతానికిచెందిన మీనా అలియాస్ లక్ష్మి(29), తిరుచ్చి ప్రాంతానికిచెందిన పొన్నుమని(34) అక్కా చెల్లెళ్లు. వీరిద్దరూ తమిళనాడులోని పలు రద్దీ ప్రాంతాల్లో తిరుగుతూ చోరీలకు పాల్పడేవారు. మీనాపై తమిళనాడులో ఆరు చోరీకేసులు నమోదయ్యాయి. ఇటీవల ఓ కేసులో రిమాండు నుంచి బయటకు వచ్చింది. తమిళనాడులోని సంతలో చోరీ చేస్తూ పొన్నుమని పోలీసులకు పట్టుబడి అరెస్టయింది. ఈమె కూడా 20రోజుల కిందట బెయిల్‌పై విడుదలైంది. వీరిద్దరూ కలిసి గత నెల 27వ తేదీన శ్రీకాళహస్తిలో జరిగిన రథోత్సవానికి వచ్చారు. జనాలు అత్యధికంగా ఉండే చోట్ల ఏడుగురు మహిళల నుంచి సుమారు105గ్రాముల బంగారు చైన్లను చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ గోపి కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా విచారణ సాగించారు. వారం రోజుల వ్యవధిలోనే తమిళనాడుకు చెందిన ఇద్దరు అక్కా చెల్లెళ్లను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. బంగారు గొలుసులను రికవరీ చేశారు. ఆ ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ చెప్పారు. వన్‌టౌన్ సీఐ గోపి, సిబ్బందిని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించి రివార్డును ప్రకటించారు.ఈ కార్యక్రమంలో సీఐలు తిమ్మయ్య, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో జనసేన పార్టీ నాయకులు

గూడూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల 14వ తేదీన జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకుడు మునిగిరీష్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక రోటరీ భవన్‌లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ఛలో పిఠాపురం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబుకు ఎమ్మెల్సీ ఇవ్వడం కార్యకర్తల్లో ఆనందాన్ని పెంపొందించిందన్నారు. ఆవిర్భావదినోత్సవానికి నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పేటేటి చంద్రనీల్, ఇంద్రవర్దన్, నయూం, వెంకటేశ్వర్లు, చంద్ర, అవినాష్, కార్తీక్, శివ, రవి, పవన్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ మహా సదస్సును విజయవంతం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న బీఎస్పీ నాయకులు

గూడూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 10వ తేదీన జరగనున్న బీఎస్పీ కార్యకర్తల మహా సదస్సును విజయవంతం చేయాలని బీఎస్పీ నాయకుడు నాశిన భాస్కర్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పోస్టాఫీసు వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనుల అభ్యున్నతి కోసం బీఎస్పీ పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు రాజు, ఎల్వీసుబ్బయ్య, లక్ష్మయ్య, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ శేఖర్‌బాబు

గూడూరు అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రహదారి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పట్టణ సీఐ శేఖర్‌బాబు అన్నారు. గురువారం పట్టణంలోని పలు కూడళ్ల వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. ఆటో డ్రైవర్లు వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తిరుపతయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా

చిల్లకూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చెన్నై -బెంగళూరు ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్ ప్రాజెక్టులో భాగంగా రైతులకు నష్టపరిహారం అందించేందుకు గ్రామసభలో ప్రచురించిన రైతుల పేర్లు, భూమి విస్తీర్ణానికి సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే తమ కార్యాలయంలో లిఖితపూర్వకంగా తెలియజేయాలని సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా కోరారు. గురువారం మండలంలోని తమ్మినపట్నం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్ ప్రాజెక్టులో భాగమైన ప్రభుత్వ భూములను సాగుచేసుకుంటున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేసిందన్నారు. అందుకోసం తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో ఉన్న 617.67 ఎకరాల ప్రభుత్వ భూములలో సర్వే నిర్వహించి తమ్మినపట్నం, తీగపాళెం తదితర గ్రామాల్లోని 385 మంది రైతుల పేర్లను, భూమి విస్తీర్ణం వివరాలను గ్రామసభలో ప్రచురించామన్నారు. అభ్యంతరాలు ఉంటే తగిన ఆధారాలతో ఏడు రోజుల్లోగా అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది,

ఏరియా ఆస్పత్రి పరిధిలోకి సబ్‌సెంటర్లను చేర్చాలి



గూడూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు పీహెచ్‌సీలోని కొన్ని సబ్‌సెంటర్లను ఏరియా ఆస్పత్రి పరిధిలోకి చేర్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరారు. గురువారం విజయవాడలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. చెన్నూరు పీహెచ్‌సీ పరిధిలో 13 ఏఎన్ఎం సబ్‌సెంటర్లు ఉన్నాయన్నారు. కొన్ని సబ్ సెంటర్‌లను ఏరియా ఆస్పత్రి పరిధిలోకి మార్చితే ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు వీలుంటుందని తెలియజేశారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

చిల్లకూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిక్కవరం, ఏరూరు గ్రామాలలో గురువారం స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు చింతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పాల్‌జాన్సన్ అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సుమ, చైతన్యభాను, హరిత, పంచాయతీ కార్యదర్శులు పద్మజ, సుభాషిణి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాటరీ టికెట్ల విక్రేతల అరెస్టు

నాయుడుపేటటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గరిడివీధిలో లాటరీ టికెట్లు విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. అర్బన్ సీఐ బాబి కథనం మేరకు.. రెండురోజుల ముందుకు ఓజిలి మండలం కురుగొండ సబ్‌స్టేషన్‌లో లైన్ ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సూసైడ్ నోటులో లాటరీ టికెట్లు కొని అప్పులపాలైనట్లు రాశాడు. ఈ క్రమంలో లాటరీ టికెట్ల విక్రేతలపై దాడులు చేశారు. పట్టణానికి చెందిన మనోహర్, సుబ్రమణ్యం, మండలంలోని వేమగుంట పాళెంకు చెందిన బాలాజీ లాటరీ టికెట్లు విక్రయిస్తుండగా అరెస్టు చేశారు.

బీసీ సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

ఓజిలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీసీ సబ్సిడీ రుణాల కోసం గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఓజిలి, ఆరిమేనిపాడు యూనియన్ బ్యాంక్‌శాఖ మేనేజర్లు కృష్ణకాంత్, సుధాకర్, కురుగొండ ఆంధ్రప్రగతి బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని 26 పంచాయతీ పరిధిలో బీసీ సబ్సిడీ రుణాల కోసం 271 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఓజిలి యూనియన్ బ్యాంక్‌కు 19, ఆరిమేనిపాడు బ్యాంకు 17, కురుగొండ్ల ఏపీజీబీకు 16 యూనిట్లు వంతున రుణాల అందించనున్నాయి.

ఇంటి పన్నులపై స్పెషల్ డ్రైవ్



ర్యాలీ చేస్తున్న డీఎల్‌పీవో, పంచాయతీ సిబ్బంది

కోట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చెందోడులో గురువారం డీఎల్‌పీవో వెంకటరమణ ఆధ్వర్యంలో ఇంటి పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్, అవగాహన ర్యాలీ జరిగింది. ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను చెల్లించి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలంటూ నినాదాలు చేశారు. డీఎల్‌పీవో వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి ఎస్ కిరణ్‌కుమార్, సచివాలయ సిబ్బంది చెందోడు, విద్యానగర్‌లలో ఇంటింటా తిరిగి ఇంటి పన్నులపై అవగాహన కల్పించి వసూళ్లు చేశారు. అనంతరం గాంధీ బొమ్మ సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు.

కాళంగి గ్రాయిన్ నిర్మించాలి

శాసన సభలో ఎమ్మెల్యే విజయశ్రీ వినతి



సూళ్లూరుపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కాళంగి నది పులికాట్‌లో కలిసే ప్రదేశంలో గ్రాయిన్ నిర్మించాలని సూళ్లూరు పేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. గురువారం శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె మాట్లాడుతూ కాళంగినది తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో 75 కిలో మీటర్ల ప్రవహిస్తూ పులికాట్‌లో కలిసి తర్వాత సముద్రంలో కలుస్తుందన్నారు. నీళ్లలేని సమయంలో పులికాట్ సరస్సులోని ఉప్పునీరు నదిలోకి చేరుతాయన్నారు. ఆ నీటితో సమీప భూగర్భజలాలు ఉప్పునీటిగా మారిపోతున్నాయన్నారు. సుమారు 35 వేల మందికి పైగా సాగు, తాగునీటికి ఇబ్బంది అవుతుందన్నారు. 50 ఏళ్లక్రితం ఇక్కడ గ్రాయిన్ నిర్మించారని 2015లో వచ్చిన భారీ వరదలకు అవి కొట్టుకుపోయిందన్నారు. అప్పటి నుంచి అది అలాగే ఉందన్నారు. వెంటనే సంబంధిత మంత్రి గ్రాయిన్ నిర్మించేందుకు చొరవచూపాలని శాసన సభలో విన్నవించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



నందగోపాల్ (ఫైల్‌ఫొటో)

పెళ్లకూరు, మార్చి 6 (ఆంధ్రజోతి) : మండలంలోని చవటకండ్రిగ సమీపంలోని 71వ జాతీయ రహదారిపై ఫిబ్రవరి 28 రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. అక్కగారిపేట గ్రామానికి చెందిన ఇలుపూరు నందగోపాల్ (23), హరికృష్ణ మేనకూరులోని ఓ పరిశ్రమలో విధులు ముగించుకొని తిరిగి మోటార్ సైకిల్‌పై ఇంటికి వస్తున్నారు. చవటకండ్రిగ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనాన్ని వెనుక నుంచి ఢీకొన్నారు. గాయపడిన నందగోపాల్‌ను నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు, అక్కడి నుంచి తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నందగోపాల్ గురువారం మృతిచెందాడు. మృతునికి భార్య ప్రజావతి, 5 నెలల చిన్నారి ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెన్నై -బెంగళూరు కారిడార్

భూ బాధితులకు రూ.8లక్షల నష్టపరిహారం

సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన



గ్రామసభలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన

కోట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కోట మండలం కొత్తపట్నంలో గురువారం చెన్నై, బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ భూములపై గ్రామసభ జరిగింది. ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలోకి కొత్తపట్నంతోపాటు పలు గ్రామాల్లో ఉన్న 367.90 ఎకరాల ప్రభుత్వ భూములు వెళ్లాయి. ఆయా భూములు పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 213 మంది రైతుల సాగులో ఉన్నట్లు గతంలో రెవెన్యూ అధికారులు సర్వేచేసి గుర్తించారు. ఒక్కో ఎకరానికి రూ.8 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో అభ్యంతరాలపై సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. భూములు కోల్పోతున్న రైతుల వివరాలను గ్రామాల వారీగా జాబితాను ప్రకటించారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే వారం రోజుల్లో అన్ని ఆధారాలతో గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదులు చేయాలని సబ్ కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జయజయరావు, ఆర్ఐ మధులత, సర్వేయర్ గోపిరెడ్డి, సర్పంచ్ తిరుపాలయ్య, ఎంపీటీసీ శేషాద్రి, తిరుపతి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్‌భరత్ రెడ్డి, నెల్లూరు ఏపీఐఐసీ డిప్యూటీ మేనేజర్ శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉత్తమ సంఘం మహిళా అవార్డుకు ఎంపికైన లక్ష్మి



కోటలో ప్లాస్టిక్ వస్తువుల దుకాణం నడుపుతున్న లక్ష్మి

కోట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కోట మండలం తిమ్మానాయుడు పాళెంలోని విజయలక్ష్మి పొదుపు గ్రూపునకు చెందిన కూరేటి లక్ష్మి ఉత్తమ సంఘ మహిళా అవార్డుకు ఎంపికయ్యారు. దీంతో గురువారం వెలుగు ఏపీఎం అనీల, పలువురు సీసీలు ఆమెను అభినందించారు. 2008లో పొదుపు సంఘంలో చేరిన లక్ష్మి రూ.5వేల రుణం పొంది తమ కుటుంబ అభివృద్ధికి బాటలు వేసుకుంటూ అంచలంచెలుగా ఎదిగింది. కోట పట్టంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో పటాలు, ప్లాస్టిక్ వస్తువుల విక్రయాల దుకాణం నడుపుతూ పొదుపు గ్రూపుల నుంచి రుణాలు పొందుతూ వాటిని సకాలంలో చెల్లిస్తూ దారిద్ర్యాన్ని జయించి ఉత్తమ సంఘ మహిళగా నిలిచింది. దీంతో ఆమెకు ఈ నెల 8వ తేదీ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సీఎం చంద్రబాబునాయుడు ప్రకాశం జిల్లా మార్కాపురంలో అవార్డును ఇవ్వనున్నారు. దీంతో వెలుగు కార్యాలయంలో లక్ష్మిని అభినందించారు.


90 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు



కంటి శస్త్ర చికిత్సలు చేసుకున్న రోగులతో వైద్యబృందం, క్యాంపు ఇంచార్జ్ పద్మనాభం

నాయుడుపేట, మార్చి 6 (ఆంధ్రజోతి): నాయుడుపేట మండలం అన్నమేడు గ్రామంలో ఫిబ్రవరి 26 నుంచి మార్చి 6తేదీ వరకు చెన్నైలోని శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో దాదాపు 400 మందికి కంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమానికి అమెరికాలోని కాటంరెడ్డి ప్రసాద్‌రెడ్డి, శోభారెడ్డి దంపతుల సహకారంతో కీర్తిశేషులు పవనమ్మ జ్ఞాపకార్థంగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 90 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్‌లు చేసి కంటి అద్దాలను అందజేశారు. రోగులతో పాటు వారితో పాటు వచ్చిన వారికి భోజన సదు పాయాలను సన్నారెడ్డి విజయ్ మోహన్‌రెడ్డి, లోకనిథ్‌రెడ్డి ఏర్పాటు చేశారు. క్యాంపు ఇన్‌చార్జి చిగురవాడ పద్మనాభం, వైద్యబృందం ఉన్నారు.

అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలకు పీడీ భరత్



చిట్టమూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : చిట్టమూరు జీఎం నాయుడు ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న భరత్ మహిపతి ప్రపంచ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 4 నుంచి బెంగళూరు కంఠీరవ అథ్లెటిక్ స్టేడియంలో జరిగిన 43వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో హ్యామర్ త్రో విభాగంలో భరత్ వెండి పతకం సాధించారు. ఈ నేపథ్యంలో మే నెలలో ఆస్ట్రేలియా దేశంలోని మెల్‌బోర్న్ పట్టణంలో జరగబోయే ప్రపంచ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలలో భారతదేశం తరఫున పాల్గొంటారు. ఎంఈవో బీవీ కృష్ణయ్య, హెచ్ఎం మీనాకుమారి, ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు.

మన సంస్కృతిని భావితరాలకు అందిద్దాం

ఎన్ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి



ప్రసంగిస్తున్న వీసీ కృష్ణమూర్తి, పక్కనే సుధాకర్‌నాయుడు

తిరుపతి(విద్య), మార్చి6 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రపంచదేశాల్లో ప్రత్యేక గుర్తింపు ఉందని, దాన్ని పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. రైల్వేకాలనీలోని మాతృశ్రీ స్కూల్ 16వ వార్షికోత్సవాన్ని గురువారం మహతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చుకుని ఉన్నత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఏబీవీపీ మాజీ జాతీయ కార్యదర్శి నాగోతు హరికృష్ణ, సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి, డాక్టర్ మహేంద్ర చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దుతున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. వివిధ అంశాల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు స్కూల్ ఛైర్మన్ డాక్టర్ కె.సుధాకర్‌నాయుడితో కలసి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేటితో ముగియనున్న పోస్టల్ క్యారమ్స్ టోర్నీ

తిరుపతి(క్రీడలు), మార్చి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక మల్టీస్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 27వ ఆలిండియా పోస్టల్ క్యారమ్స్ టోర్నమెంట్ శుక్రవారం ముగియనుంది. గురువారం సెమీఫైనల్స్ హోరాహోరీగా సాగాయి. శుక్రవారం జరగనున్న తుదిపోరులో మహిళల సింగిల్స్‌లో ఆర్.వినిత(తమిళనాడు), నీలమ్‌గోడకే(మహారాష్ట్ర), పురుషుల డబుల్స్‌లో తమిళనాడు నుంచి రెండు, ఒడిశా-తెలంగాణ జట్లు తలపడనున్నాయి. చివరగా విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు.

ఉమ్మడి పీజీ సెట్ రద్దు కోసం నేడు పీజీసెట్ ఆఫీసు వద్ద ధర్నా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పీజీ సెట్ రద్దు కోసం నేడు పీజీసెట్ కార్యాలయం ముందు విద్యార్థి సంఘాలు ధర్నాకు పిలుపునిచ్చాయి. ఎస్వీయూలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నేత చలపతి, ఎస్ఎఫ్ఐ నేత అశోక్, పీడీఎస్‌యూ నేత ఆశ, బీసీ విద్యార్థి సంఘ నేత తిరుమలేష్, లా విద్యార్థి సంఘ నేత సుందరాజు తదితరులు పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి పీజీ సెట్ రద్దు చేసి, పీజీ అడ్మిషన్ల బాధ్యతను యూనివర్సిటీలకే అప్పగించాలన్నారు. లేకపోతే విద్యార్థులు లేక యూనివర్సిటీలు మూతపడే ప్రమాదం ఉందన్నారు. పీజీ సెట్ రద్దు చేయకపోతే ఉద్యమాన్ని తీవ్రం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లోకేష్, వినోద్, చంద్రనాయక్, శివ, తదితరులు పాల్గొన్నారు.

బాలల రక్షణకు కృషి చేయాలి

తిరుపతి(వైద్యం), మార్చి 6(ఆంధ్రజ్యోతి): బాలలపై లైంగిక వేధింపులను నిర్మూలించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ అన్నారు. రుయా చిన్నపిల్లల విభాగంలో గురువారం బాలల లైంగిక వేధింపులపై అవగాహన, నివారణ నైపుణ్యాలపై పలు శాఖల సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలలపై లైంగిక వేధింపులను నివారించడం, బాధితులకు సహాయం అందించడం గురించి వివరించారు.

మినిమం టైంస్కేల్ అమలు చేయాలి



డీవైఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

తిరుపతి(విద్య), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ అమలు చేయాలని సంఘం గౌరవాధ్యక్షుడు గండికోట నాగవెంకటేష్, కోశాధికారి ఇ.శివకుమార్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం వారు తిరుపతి అర్బన్ ఎంఈఓ కార్యాలయం వద్ద గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలుకు కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని, ప్రభుత్వ వెయిటేజీ, కారుణ్య నియామకాలు, నిర్దిష్టమైన జాబ్‌చార్ట్, ఉద్యోగ విరమణ వయసు పెంపు తదితర సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఈనెల 11వ తేదీన విజయవాడలో చేపట్టనున్న నిరసన దీక్షలో జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. డీటీఈఓ షేక్ హసీనా, సీఆర్ఎంటీ సభ్యులు వేణుగోపాల్, ధనపాల్, నవీన్‌కుమార్, ఆశాలత, రమాదేవి, రూపావతి పాల్గొన్నారు.

ఐజేబీసీసీ సమావేశాలకు శ్రీసిటీ ఎండీ



ప్రసంగిస్తున్న రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని ఫిక్కీ కార్యాలయంలో జరిగిన 48వ ఇండియా-జపాన్ బిజినెస్ కోఆపరేషన్ కమిటీ (ఐజేబీసీసీ), జపాన్-ఇండియా బిజినెస్ కో ఆపరేషన్ కమిటీ (జేఐబీసీసీ) ఉమ్మడి సమావేశాలలో శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ప్రసంగించారు. పరిశ్రమలు, ప్రాంతీయాభివృద్ధికి ఇండియా- జపాన్ వ్యూహాత్మక భాగస్వామ్యంపై జరిగిన ఈ సమావేశానికి జపాన్ నుంచి ఉన్నత స్థాయి పారిశ్రామిక ప్రతినిధులు హాజరయ్యారు. భవిష్యత్తు కోసం సుస్థిర సరఫరా గొలుసు వ్యవస్థను నిర్మించడం అనే ప్లీనరి సెషన్‌లో రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడారు. దేశంలోనే రెండో అతిపెద్ద జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా, శ్రీసిటీలో ఇప్పటికే ఇసుజు, యూనిచార్మ్, డైకిన్, టీహెచ్‌కే వంటి 31 కంపెనీలు, వాటికి విడి భాగాలు సరఫరా చేసే కంపెనీలు ఉన్నాయన్నారు. శ్రీసిటీలో ఓఈఎం కంపెనీలు టైర్ 1, టైర్ 2 విడి భాగాల పరిశ్రమలు ఒకే చోట ఉండడం వల్ల సమర్థత పెరిగి ఉత్పత్తి, లాజిస్టిక్ మరింత సులభతరం అవుతున్నాయన్నారు. పరిశ్రమ, విద్య, స్థిరమైన అభివృద్ధి శ్రీసిటీ దార్శనికతకు నిదర్శనమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జపాన్ భారత రాయబారి ఓనో కెయిచీ, భారత జపాన్ రాయబారి శిబిజార్జ్, ఐజేబీసీసీ ఛైర్మన్ ఒంకర్ ఎస్.కన్వార్, జేఐబీసీసీ ఛైర్మన్ తత్సువో యాసునాగా, జపాన్ ఎకనామిక్, ట్రేడ్, ఇండస్ట్రీస్ మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ గాకుయెడా పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే చర్యలు

తిరుపతి(వైద్యం), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడే ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, చేస్తున్నట్లు ప్రకటనలు ఇచ్చినా మూడేళ్ల జైలు శిక్ష, రూ.50 వేలు జరిమానా విధిస్తామని తెలిపారు. భారత వైద్యమండలి నుంచి ధృవీకరణ పత్రాన్ని ఐదేళ్లు తొలగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

జగన్ దిష్టి బొమ్మ దహనం

చిల్లకూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం మండలంలోని చింతవరం గ్రామంలో జనసే పార్టీ నాయకులు, కార్యకర్తలు జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ మాట్లాడుతూ కోడికత్తి డ్రామాలను అడ్డం పెట్టుకుని రాజ కీయాలు చేసిన జగన్‌కు పవన్ కళ్యాణ్‌ను విమర్శించే స్థాయి లేదన్నారు. ప్రజలు బుద్ధి చెప్పేలా తీర్పు నిచ్చినా ఆయన మారకపోవడం శోచనీయమన్నారు. కాగా పిఠాపురంలో ఈ నెల 14వ తేదీన జరగనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని తమ్మినపట్నం గ్రామంలో జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో శివాజీ, రవి, మహేష్, క్రాంతి, కార్తీక్, సునీల్, సుధీర్, మోహన్, క్రాంతి, చిన్నా, వేణు, రజినీ తదితరులు పాల్గొన్నారు.



జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జనసేన నాయకులు

పేద మహిళలకు చీరల పంపిణీ



పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు

కోట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి విజయ భాస్కర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని నీలగిరి సంఘం, ఎన్టీఆర్‌కాలనీ, ప్రకాశం కాలనీలోని నిరుపేద గిరిజన మహిళలకు విజయ భాస్కర్‌రెడ్డి వితరణతో ఆయన తల్లిదండ్రులు చీరలు పంపిణీ చేశారు. అలాగే విద్యానగర్ గాంధీ బొమ్మ సెంటర్‌లో టీడీపీ నాయకులు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. స్థానిక యువత ఆధ్వర్యంలో భాస్కర్‌రెడ్డిని పూలమాలలతో సత్కరించి కేక్‌కట్‌చేశారు.

బ్రోచర్ విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో వచ్చేనెల 9వ తేదీ నుంచి నిర్వహించే అంతర్జాతీయ సదస్సు బ్రోచర్‌ను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు గురువారం ఆవిష్కరించారు. సంప్రదాయ ఔషధం, ఆధునిక చికిత్స విధానంతో అనుసంధానించాలన్నారు. సంప్రదాయ ఔషధం - ఆరోగ్య రక్షణ అంశంపై బోటనీ విభాగం నిర్వహించే సదస్సు విజయవంతం కావాలన్నారు. కార్యక్రమంలో బోటనీ హెడ్ నాగలక్ష్మీదేవమ్మ, సదస్సు డైరెక్టర్ కామాక్షమ్మ, డాక్టర్ చంద్ర పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి

● మంత్రి లోకేష్‌కు ఎమ్మెల్యే ఆదిమూలం విజ్ఞప్తి



మంత్రి లోకేష్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గంలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి నారా లోకేష్‌కు సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం వినతిపత్రం అందించారు. గురువారం అసెంబ్లీ సెషన్ అనంతరం సచివాలయంలోని మంత్రి లోకేష్ కార్యాలయ భవనానికి వెళ్లి మర్యాదపూర్వకంగా ఆయన కలసి సమస్యలను విన్నవించారు. సత్యవేడు మండలం చమర్తికండ్రిగ, పిచ్చాటూరు మండలంలోని ముడియూరు(కొత్త గొల్లకండ్రిగ), సబ్‌స్టేషన్ నిర్మాణాల టెండర్ల ప్రక్రియ పూర్తి చేయడం, గతంలో టెండర్ల వరకు వచ్చి ఆగిన పిచ్చాటూరు-శ్రీకాళహస్తి ప్రధాన రహదారి మార్గంలోని పిచ్చాటూరు నుంచి రెప్పాలపట్టు వరకు 3 కి.మీ డబుల్ రోడ్డు నిర్మాణం, పిచ్చాటూరులో 4 పడకల ప్రభుత్వాస్పత్రిని 30 పడకల ఆస్పత్రి స్థాయికి పెంచడం, అర్ధాంతరంగా ఆగిన అరణియార్ ఆధునికీకరణ పనులను పునరుద్ధరింప చేయడం, దుస్థితికి చేరుకున్న గ్రామీణ రహదారులు, శ్మశాన దారులకు మరమ్మతులు చేయించడం వంటి ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే మంత్రి లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు గాను మంత్రి కూడా సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మా బడిని మా కాలనీలోనే ఉంచండి

● ఎస్‌ఎల్‌పురం ఎస్టీకాలనీ వాసుల విజ్ఞప్తి



ఎస్‌ఎల్‌పురం ఎస్టీకాలనీలోని పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు, విద్యార్థులు

కేవీబీపురం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మా బడి మా కాలనీలోనే ఉండాలని మండలంలోని ఎస్‌ఎల్‌పురం ఎస్టీకాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు. ఎస్ఎల్‌పురం ఎస్టీకాలనీ వాసులు తమ పిల్లలతో కలిసి గురువారం కాలనీలో ఉన్న పాఠశాల వద్ద నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఎస్ఎల్‌పురం ఎస్టీకాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో సుమారు 23 మంది విద్యార్థులు 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్నారు. ఇటీవల ఈ పాఠశాలలోని 3, 4, 5వ తరగతి విద్యార్థులను కేవీబీపురంలోని పాఠశాలకు పంపాలని ప్రతిపాదనలు వచ్చాయి. దీనిపై గతంలో కూడా తల్లిదండ్రులు నిరసన తెలిపారు. కాగా గురువారం ఎంఈవో అధ్యక్షతన కేవీబీపురం పాఠశాలలో కాలనీవాసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ 3, 4, 5వ తరగతి విద్యార్థులను కేవీబీపురం పాఠశాలకు పంపాలని ప్రభుత్వం ప్రతిపాదనలు చేస్తోందని తెలిపారు. ఇందుకు స్పందించిన తల్లిదండ్రులు మాట్లాడుతూ నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కేవీబీపురంకు పిల్లలు నడచి వెళ్లాలంటే కష్టమవుతుందని, అంత దూరం పంపలేమని తేల్చి చెప్పారు. మా కాలనీలోనే పాఠశాల కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో మీ ఆవేదనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని అధికారులు వారికి చెప్పారు.

సమష్టి కృషితో దిగ్విజయం



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో బాపిరెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో ముక్కంటి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాలు దిగ్విజయంగా జరిగాయని ఉత్సవాల సేవా కమిటీ సభ్యులు రంగినేని చెంచయ్య నాయుడు అన్నారు. ఉత్సవాల ముగింపుపై గురువారం ముక్కంటి ఆలయంలోని జ్ఞానప్రసూనాంబిక అతిథి గృహం వద్ద ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈవో బాపిరెడ్డి ముందుగా ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఉత్సవాల్లో సేవలందించిన అన్ని శాఖల అధికారులను శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం చెంచయ్య నాయుడు మాట్లాడుతూ ఈ యేడాది రాష్ట్ర ప్రభుత్వం మహాశివరాత్రి ఉత్సవాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ముందుచూపుతో ప్రణాళికబద్ధంగా అధికారులకు సూచనలు చేయడం ద్వారా భక్తులకు సులభంగా దర్శన భాగ్యం కల్పించారన్నారు. ప్రభుత్వం ఉత్సవాల పర్యవేక్షణ కోసం 20 మంది సభ్యులతో సేవా కమిటీని నియమించడం మంచి సత్ఫలితాలను ఇచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పారా ఒలంపిక్ అథ్లెటిక్ దీప్తి జీవన్‌కు సన్మానం



దీప్తి జీవన్‌ను సన్మానిస్తున్న తపస్య పాఠశాల యాజమాన్యం

రేణిగుంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ భారతీయ పారా ఒలంపిక్ అథ్లెటిక్ దీప్తి జీవన్‌ను స్థానిక తపస్య పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. గురువారం తపస్య పాఠశాలకు విచ్చేసిన ఆమెను యాజమాన్యం విక్రమ్‌శాలి, అనూష సత్కరించారు. దీప్తి జీవన్ మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు చిన్న వయసులోనే తమకు ఇష్టమైన క్రీడల పట్ల దృష్టి సారించాలని సూచించారు. క్రీడల ప్రాముఖ్యత, శ్రమ, పట్టుదల గురించి వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

శేష వాహనంపై సుబ్రహ్మణ్యేశ్వరుడి దర్శనం



శేష వాహనంపై ఊరేగుతున్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణం, తిరుపతి రోడ్డులో వెలిసియున్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ 53వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శేష వాహనంపై ఊరేగారు. గురువారం ఉదయం అమ్మవార్ల సమేత స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి శేష వాహనంపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కర్పూర నీరాజనాలతో మొక్కులు తీర్చుకున్నారు.

ఇళ్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి

వడమాలపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలో 2019కి ముందు ప్రభుత్వ, అనాధీన భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జరీనా తెలిపారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ వివాద రహిత ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి ప్రభుత్వం క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించిందన్నారు. ఆయా సచివాలయాల్లో దరఖాస్తు చేయాలని చెప్పారు. స్లాబ్ మేరకు రిజిస్ట్రేషన్ రుసుం చెల్లించాలన్నారు. ఆర్‌సీసీ పైకప్పుతో ఇళ్లు నివాస యోగ్యమై ఆధారాలతో మహిళ పేరుమీదుగా ఈనెల 31వ తేదీలోగా ఆయా పరిధిలోని సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లకు దరఖాస్తులు అందజేయాలని చెప్పారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య

రేణిగుంట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో వృద్ధురాలు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మండలంలోని వెదలచెరువులో చోటు చేసుకుంది. ఎస్ఐ అరుణ్ కుమార్ కథనం మేరకు.. వెదలచెరువు ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న సరస్వతమ్మ(75) 20 ఏళ్లుగా అనారోగ్యంతో, మానసికంగా ఇబ్బంది పడుతూ జీవనం సాగిస్తోంది. ఉదయం కుటుంబ సభ్యులు బయటికి వెళ్లడంతో సమీపంలోని మామిడి తోటలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఆమె మనవడు దినకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదాలకు నిలయం మర్రిగుంట యూటర్న్



మర్రిగుంట యూటర్న్ వద్ద ప్రమాదానికి గురైన కారు (ఫైల్‌ఫొటో)

రేణిగుంట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మర్రిగుంట యూటర్న్ ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. వివరాల్లోకి వెళితే.. జనవరి నెలలో ఆరులేన్ల హైవే అందుబాటులోకి రాగా మర్రిగుంట యూటర్న్ వద్ద ఇప్పటికే ఏడు ప్రమాదాలు చోటు చేసుకోగా, ఇద్దరు మరణించారు. ఇందులో జనవరి 1వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త ప్రసాద్ మృతి చెందగా, భార్య ఇప్పటికీ కోమాలో చికిత్స పొందుతున్నారు. అలాగే ఫిబ్రవరి 6వ తేదీన జరిగిన ప్రమాదంలో ఉపాధ్యాయురాలు కరీమునిసా బేగం అక్కడికక్కడే మృతి చెందగా, హైవేపై మర్రిగుంట మలుపు వద్ద వేగాన్ని అదుపు చేయలేక రెండు వేరువేరు సరుకుతో వెళుతున్న లారీలు బోల్తా కొట్టాయి. ప్రధానంగా రేణిగుంట మీదుగా పాత చెక్ పోస్ట్ వైపు నుంచి హైవే పైకి వాహనాలు ఎక్కే సమయంలో తిరుపతి వైపు నుంచి శ్రీకాళహస్తి వైపు వెళ్లే వాహనాలు సమీపంలోని వంతెనపై నుంచి కిందకు దిగే సమయంలో వేగంగా రావడంతో మర్రిగుంట యూటర్న్ వద్ద వాహనాలను ఢీకొట్టడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో పాటు తూకివాకం నుంచి కృష్ణాపురం పంచాయతీ వరకు విస్తరించిన హైవేకి రెండు పక్కల గ్రామాలు ఉండడంతో ఇక్కడి ప్రజలు, గేదెలు, గొర్రెలు, రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయంపై డీఎస్పీ శ్రీనివాసరావుని వివరణ కోరగా.. ఇప్పటికే నేషనల్ హైవే అథారిటీ వారితో మాట్లాడినట్లు చెప్పారు. ప్రత్యేకంగా స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు, సోలార్ లైట్లు మరో రెండు వారాల్లో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

రెవెన్యూ శాఖలో మాయాజాలం

● ఒకరి భూమి మరొకరికి బదలాయింపు



తన సాగులో ఉన్న భూమిని చూపుతున్న రైతు వెట్టిరవి

సత్యవేడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు రెవెన్యూ శాఖలో భూ రికార్డులు తారుమారు చేస్తూ మాయాజాలం చేస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బంది కొందరు ఒక రైతు అనుభవంలో ఉన్న భూములను ఎలాంటి ఆధారం లేకుండా వెబ్‌ల్యాండ్‌లో మరొకరికి కట్టబెడుతూ కాసులు దండుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి మండలంలోని వానెల్లూరుకు చెందిన వెట్టిరవి అనే దళిత రైతుకు చెందిన భూమిని హైదరాబాదుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పేరుమీద ఆన్‌లైన్‌లో నమోదు చేయడమే నిదర్శనం. బాధిత రైతు వెట్టిరవి కథనం మేరకు... 2015లో అప్పటి ప్రభుత్వం భూపంపిణీలో వెట్టిరవికి వానెల్లూరు పంచాయతీ సర్వేనెంబరు 184/1లో 2.17 ఎకరాల సాగు భూమిని కేటాయించింది. ఇందుకు సంబంధించి పట్టాదారు పాసుపుస్తకం కూడా జారీ అయింది. ఈ భూమిలో పది సంవత్సరాలుగా మామిడి చెట్ల పెంపకంతో పాటు పుచ్చ తదితర ఉద్యాన పంటలను కూడా సాగు చేసుకుంటున్నాడు. ఈ భూమిపై రవి బ్యాంకులో సైతం రుణం తీసుకున్నాడు. ఇదిలా ఉండగా ఇటీవల వెబ్‌ల్యాండ్‌లో తన భూమిని హైదరాబాదుకు చెందిన ముప్పిడి సందీప్‌రెడ్డి పేరుతో మార్చేసినట్లు రైతు ఆరోపిస్తున్నాడు. వెబ్‌ల్యాండ్‌లో వేరొకరి పేరుతో మారిన తన భూమిని తన పేరుతో మార్చాలని ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులోనూ, జిల్లా కలెక్టరేట్‌లోనూ వినతిపత్రం సమర్పించినట్లు తెలిపాడు. అయితే ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని ఆయన వాపోతున్నాడు.

ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జిలో మోసాలు

● తప్పుడు కొలతలతో నష్టపోతున్న రైతులు



వే బ్రిడ్జి సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అష్టకష్టాలు పడి.. అప్పు చేసి పండించిన పంటను కొనుగోలు చేసే వ్యాపారులు, దళారులతో మోసపోవడమే కాకుండా ఎలక్ట్రానిక్ వేబ్రిడ్జిలో కూడా రైతులు మోసానికి గురైన సంఘటన మండలంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. రైతులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని పలు గ్రామాల రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన దళారులు కాంపాళెం గిరిజన కాలనీ వద్ద ఉన్న ఒక ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జిలో లారీతో సహా ధాన్యాన్ని వేమెంట్ తూకం వేయిస్తున్నారు. వే బ్రిడ్జి సిబ్బంది ఎలక్ట్రానిక్‌లో తప్పుడు కొలతలు సృష్టించి రైతులను మోసం చేస్తున్నారు. వే బ్రిడ్జిలో డిజిటల్ నివేదికను రైతులకు చూపించకుండానే కార్యాలయంలో తప్పుడు బిల్లులు ఇస్తున్నారు. దీనిపై బుధవారం రాత్రి వేమెంట్ సిబ్బందిని ప్రశ్నించగా రైతులపై తిరగబడ్డారు. రైతులు ఏమీ చేయలేని పరిస్థితిలో పోలీసులకు ఫిర్యాదుచేయనున్నట్లు తెలిపారు. కంచనపుత్తూరు గ్రామానికి చెందిన వెంకటరమణ మాట్లాడుతూ రైతులు పండించిన పంట కొనుగోలులో వ్యాపారస్థులు మోసంచేస్తుంటే.. వే బ్రిడ్జి సిబ్బంది అన్యాయంగా తూకాలు వేస్తూ మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తూనికలు కొలతల అధికారులు ఎలక్ట్రానిక్ కాటాలను తనిఖీ చేసి తగినచర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మూణ్ణాళ్ల ముచ్చట..!

● మళ్లీ గుంతలు తేలిన ఎన్టీఆర్ నగర్ కూడలి



ఎన్టీఆర్ నగర్‌లో గుంత పడిన రోడ్డు

శ్రీకాళహస్తి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ కూడలిలో గుంతలకు చేపట్టిన మరమ్మతులు మూణ్ణాళ్ల ముచ్చటగా మారాయి. మళ్లీ నెలరోజులకే అక్కడ గుంత తేలింది. ఎన్టీఆర్‌నగర్ ప్రాంతంలో కొద్ది సంవత్సరాల నుంచి రోడ్డు గుంతలమయంగా ఉండేది. గత వైసీపీ పాలకులు కనీసం పట్టించుకోకపోవడంతో ఈ ప్రాంతంలో రాకపోకలు సాగించే స్థానికులు ఇబ్బందులు పడేవారు. ఈ మార్గంలో ఎన్టీఆర్‌నగర్‌తో పాటు దేవరమిట్ట, మంచినీళ్లగుంట, తెలుగుగంగ కాలనీ, ప్రభుత్వ పురుషుల, మహిళ డిగ్రీ కళాశాలలు ఉండటంతో నిత్యం ప్రజలు పెద్దసంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం రోడ్లకు గుంతలు పూడ్చే ప్రక్రియను చేపట్టగా.. మొదటి వారంలో ఎన్టీఆర్‌నగర్ వద్ద గుంతలను పూడ్చారు. అయితే నెలరోజులకే అక్కడ మళ్లీ గుంత పడింది. అక్కడ రోడ్డు మళ్లీ కొంచెం కొంచెంగా దెబ్బతింటుందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మళ్లీ ప్యాచ్ వర్క్ నిర్వహించాలని ఇక్కడి ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ



దశరథాచారిని పరామర్శిస్తున్న ప్రకాష్ నాయుడు తదితరులు

శ్రీకాళహస్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిపూడి దశరథాచారి అనారోగ్యంతో బాధ పడుతూ తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం టీడీపీ పార్లమెంటు రైతు ఉపాధ్యక్షుడు ప్రకాష్ నాయుడు, తొట్టంబేడు మండలాధ్యక్షుడు గాలి మురళి నాయుడు ఆయన్ను పరామర్శించారు. త్వరగా కోలుకుని ప్రజాసేవలో నిమగ్నం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్, దొరబాబు, భాస్కర్‌గౌడ్ తదితరులున్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతరు



స్వామివారి రథం పక్కనే అనధికారికంగా తెరచిన లగేజీ లాకర్

శ్రీకాళహస్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద ఓ వ్యాపారి పురపాలక సంఘ అధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని స్వామివారి రథం పక్కనే ఉన్న పురపాలక సంఘం కాంప్లెక్సును కొద్ది సంవత్సరాల క్రితం కొందరు ప్రైవేటు వ్యక్తులు లీజుకు పొందారు. ఇటీవల 9 నెలల క్రితం అద్దె బకాయిల చెల్లింపుపై వివాదం చెలరేగడంతో పురపాలక సంఘ అధికారులు ఆ కాంప్లెక్సును సీజ్ చేశారు. దీనిపై ఎలాంటి వ్యాపార లావాదేవీలు జరగకుండా ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కాంప్లెక్సు ఎదుట చెప్పుల స్టాండు, లగేజీ లాకర్‌తో కూడిన దుకాణాన్ని ఓ వైసీపీ కార్యకర్త కొద్దిరోజులుగా గతంలోలాగా యథావిధిగా తెరిచాడు. అధికారుల ఆదేశాలను సైతం ఆయన బేఖాతరు చేయడంపై స్థానిక ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత



బాలుడిని చూపుతున్న ఎస్ఐ విశ్వనాథ నాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌కండ్రిగ మండలంలో సంచరిస్తున్న తెలంగాణ రాష్ట్రం కామారెడ్డికి చెందిన బాలుడు రవీంద్ర(12)ను ఎస్ఐ విశ్వనాథ నాయుడు గుర్తించి తల్లిదండ్రులకు గురువారం అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కామారెడ్డికి చెందిన 7వ తరగతి విద్యార్థి రవీంద్రను బీఎన్‌కండ్రిగలో గుర్తించామన్నారు. బాలుడిని గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించామని, వారు వచ్చాక అప్పగించినట్లు ఆయన తెలిపారు. బడి ఈడు పిల్లలను తప్పకుండా బడికి పంపించాలని ఆయన ఈ సందర్భంగా వారికి సూచించారు.

ఫారెస్టు వాచర్ కుటుంబానికి ఆర్థిక సాయం



వెంకటేష్ కుటుంబానికి చెక్కును అందజేస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి అటవీక్షేత్ర పరిధిలో సింగమాల ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద గత సంవత్సరం విధులు నిర్వహిస్తున్న ప్రొటెక్షన్ వాచర్ వెంకటేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విధితమే. గురువారం అటవీశాఖ తిరుపతి సర్కిల్ ఐఎఫ్ఎస్ కన్సర్వేటర్ సెల్వం, జిల్లా అటవీశాఖ అధికారి వివేక్‌లు వెంకటేష్ కుటుంబానికి రెండవ విడత ఆర్థిక సాయంగా రూ.4లక్షల చెక్కును అందజేశారు. వారు మాట్లాడుతూ పిల్లల చదువుకు, కుటుంబానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు లోకేష్, దేవరాజులు, దామోదరం తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు వేశారు.. స్పీడ్ బ్రేకర్లు మరిచారు



ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రోడ్లు వేశారు కానీ స్పీడ్ బ్రేకర్లను మరిచారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర రెడ్డి అన్నారు. ఆయన నాయకులతో కలిసి గురువారం పట్టణ పరిధిలో నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారి మరమ్మతు పనుల్లో భాగంగా నూతనంగా వేసిన తారురోడ్డు పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డులో మిట్టకండ్రిగ నుంచి ఏఎం పుత్తూరు వరకు స్పీడ్ బ్రేకర్లు వేయడం మరిచారన్నారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆర్డీవో తక్షణం స్పందించి తిరిగి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కరీముల్లా, సురేంద్రరెడ్డి, నవీన్, మునిరాజా, అంటోని తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు పనుల పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లమాలలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు పనులను ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు గురువారం పరిశీలించారు. పంచాయత్ రాజ్ ఏఈ నాగరాజును పనుల నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సీడీపీవో శాంతిదుర్గ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ స్త్రీ జీవితంలో పుట్టుక, విద్య, వివాహం, ఆర్థిక స్వావలంబన అనే అంశాల్లో పరిపూర్ణత కలిగి ఉండాలని, అపుడే నిజమైన స్వేచ్ఛ, సమానత్వం వచ్చినట్లని చెప్పారు. డీఎల్‌డీవో సుస్మిత, కమిషనర్ గిరికుమార్ పాల్గొన్నారు.


సమాజ నిర్దేశకులు మహిళలు

పిచ్చాటూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కుటుంబంతో పాటు సమాజాన్ని సరిదిద్దే నిర్దేశకులు మహిళలు మాత్రమేనని పిచ్చాటూరు ఎంపీపీ రేఖ అన్నారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఆటల పోటీల్లో ప్రతిభకనబరచిన అంగన్‌వాడీ కార్యకర్తలకు బహుమతులు ప్రదానం చేశారు. సీడీపీవో శోభారాణి, ఎంఈవో హేమమాలిని, ఈవోపీఆర్‌డీ శ్రీదేవి, ఏపీఎం చంద్రకళ, ఏపీవో నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ విఖితకు సన్మానం

సత్యవేడు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సత్యవేడు మాజీ ఎంపీటీసీ విఖితను దేవాంగ అభ్యుదయ సేవాసంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సత్యవేడులో జరిగిన కార్యక్రమంలో దేవాంగ సామాజికవర్గ అభివృద్ధికి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, మండల, జిల్లా, జోనల్ స్థాయిలో సేవలు అందిస్తున్న మహిళలను సత్కరిస్తున్నట్లు ఆ సంఘం కన్వీనర్ గుత్తి త్యాగరాజు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు హేమావతి, విజయ, హేమలత, విజయ, కాంచన, బండారు మోహన్‌బాబు, శివానందం, సుబ్రహ్మణ్యం, రామచంద్రయ్య, సోమశేఖర్ పాల్గొన్నారు.

మెప్మా ఆర్పీ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న సరళ

శ్రీకాళహస్తి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణం 9వ వార్డు పరిధిలో మెప్మా ఆర్పీగా పనిచేస్తున్న సరళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ మేరకు ఆమె చికిత్స నిమిత్తం గురువారం శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో చేరింది. సీపీఐ ఏరియా కార్యదర్శి గురవయ్య, సీఐటీయూ నియోజకవర్గ కార్యదర్శి పెనగడం గురవయ్యలు సరళను పరామర్శించారు. వారు మాట్లాడుతూ గత కొద్ది నెలలుగా మెప్మాలో ఆర్పీగా పనిచేస్తున్న సరళను కొందరు రాజకీయ కక్షసాధింపు ధోరణితో వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. దీంతో సరళ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని ఆరోపించారు. సంబంధిత మెప్మా ఉన్నతాధికారులు స్పందించి ఆమెకు న్యాయం చేయాలని కోరారు.

పిచ్చాటూరు తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

పిచ్చాటూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండల తహసీల్దార్‌గా టి.వి.సుబ్రహ్మణ్యం గురువారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి కలెక్టరేట్ నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. అందరి సహకారంతో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.